PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 292 | విజయవాడ, మంగళవారం 28 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 28 May 2024 | Rs

ప్రభుత్వ విద్యను నిలబెట్టుకుంటేనే భవిష్యత్
- కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య
- శేషగిరి వర్ధంతి సభలో విరసం బాలసుబ్రహ్మణ్యం

3



చిరస్మరణీయ విజయాలు మన సొంతం
- ఫైనల్లో ఓటమితో అధైర్యపడొద్దు
- సన్‌రైజర్స్ కావ్యా మారన్

8

వృద్ధి తగ్గుతోంది..!

• జిడిపి అంచనాలకు నిపుణుల కోత • మార్చి త్రైమాసికంలో 6.7 శాతమే..!

బెంగళూరు : పోలింగ్ ప్రక్రియ ముందు వరకు దూసుకుపోతున్నట్లు కనిపించిన ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనం ఇప్పుడు బట్టబయలవుతోంది. ఐఎంఎఫ్‌తో పాటు వివిధ ఆర్థిక సంస్థలు 2023-24లోనూ భారీ వృద్ధి ఖాయమని తెలిపాయి. రిజర్వుబ్యాంకు ఆప్ ఇండియా 7 నుండి 7.5శాతం మధ్య వృద్ధి ఉంటుందని అంచనా వేసింది. ఈ అంచనాలపై అప్పటోనే అనుమానాలు వ్యక్తమైనాయి. పోలింగ్ ప్రక్రియ ముగింపునకు వచ్చిన ప్రస్తుత సమయంలో దానికి భిన్నమైన గణాంకాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) లోనూ వృద్ధి అంతంతమాత్రమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం జాతీయ స్థూల ఉత్పత్తి వృద్ధి పతనం దిశలో ప్రయాణం చేస్తోంది. 'భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. డిమాండ్ లేమి కారణంగా జనవరి - మార్చి త్రైమాసికంలోని జిడిపి వృద్ధి 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే అతి కనిష్ట స్థాయికి పడిపోనుంది. డిసెంబర్ త్రైమాసికంలోని పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం లేదు.' అని స్పష్టం చేసింది. 2024 జనవరి - మార్చి త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.7 శాతానికే పరిమితం కావొచ్చని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అంచనా వేశారు. 2023 డిసెంబర్ త్రైమాసికంలో భారత జిడిపి 8.4 శాతం, సెప్టెంబర్‌లో 8.1 శాతం, జూన్ త్రైమాసికంలో 8.2 శాతం చొప్పున నమోదయ్యింది.

భవిష్యత్తులోనూ ...

జిడిపిలో 60 శాతం వాటా కలిగిన వ్యక్తిగత వినియోగం ఇంకా తగ్గుముఖంలోనే ఉంది. ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలు లేకపోవడంతో భవిష్యత్తులోనూ వ్యక్తిగత వినియోగం పెరిగే అవకాశం లేదు. దీని ప్రభావం రాబోయే త్రైమాసికాల్లోనూ పడే అవకాశం ఉంది. రాయిటర్స్ నిర్వహించిన తాజా అభిప్రాయ సేకరణలో కూడా ఇదే వ్యక్తమైంది. రాయిటర్స్ పోల్ ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సగటున 7.7 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా, వచ్చే ఏడాది (2025-26)లో 6. 6 శాతానికి వృద్ధి మందగిస్తుందని తాజాగా అంచనా వేశారు.

అంచనాల కంటే తగ్గుతుంది : నిపుణులు

రాయిటర్స్ 54 మంది నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. చాలా మంది ఆర్థికవేత్తలు తయారీ, సేవల రంగాలలో డిమాండ్ లేదని, ఫలితంగా వృద్ధి మందగించిందని విశ్లేషించారు. అదే విధంగా వ్యవసాయ రంగంలో కూడా స్తబ్దత చోటు చేసుకుందని తెలిపారు. జిడిపిలో 50 శాతం వాటా కలిగి ఉన్న అసంఘటిత రంగ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదన్న అభిప్రాయం కూడా పలువురు నిపుణులు వ్యక్తం చేశారు. తాము ముందు వేసిన అంచనాల కంటే జిడిపి తగ్గనుందని ఆర్థికవేత్తలలో మూడింట రెండు వంతుల మంది పేర్కొన్నట్లు రాయిటర్స్ తెలిపింది. '2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో గొప్ప మెరుగుదల ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నాము. కీలక ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతుంది. కరోనా వ్యాప్తి తరువాత దేశంలో డిమాండ్ తగ్గింది. అప్పటి నుండి ఆ స్థాయిలోనే కొనసాగుతోంది. తక్కువ వృద్ధికి అదే కారణం' అని సొసైటీ జనరల్ ఇండియా ఎకనామిస్ట్ కునాల్ కుందు పేర్కొన్నారు. భారత్‌కు 5-6 శాతం సహేతుకమైన వృద్ధికే అవకాశాలు ఉన్నాయని పాంథియోన్ మాక్రో ఆసియా ఎకనామిస్ట్ మిగ్యుల్ చాంకో పేర్కొన్నారు.

నాగార్జున విశ్వవిద్యాలయంలో లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

• జాప్యం లేకుండా ఫలితాలు • సిఇసి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సిఇఓలు, ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, డాక్టర్ సుఖ్బీర్‌సింగ్‌సందుతో కలిసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలను ఏ మాత్రం ఆలస్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అదే సమయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కూడా పూర్తిస్థాయిలో పాటించాలన్నారు. పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం పట్ల అధికారులను ఆయన అభినందించారు. అదే స్ఫూర్తితో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఇవిఎమ్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాస్‌లు లేని వారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పవర్ బ్యాక్ అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి పరికరాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేర్చుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఆయా ఇవిఎమ్‌లపై మార్కు చేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపరచాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏ మాత్రం ఆలస్యం చేయొద్దని, డిస్‌ప్లే బోర్డుల ద్వారా ఎప్పటికప్పుడు కచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా, అదనపు సిఇఓలు పి.కోటేశ్వరరావు, ఎమ్ఎన్ హరీందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి 20 పారామిలిటరీ బలగాలు
- సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా

2

పిన్నెల్లి కేసు వాదనలు పూర్తి

నేడు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులు నమోదు చేసిన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాచర్ల ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును మంగళవారం వెలువరిస్తామని న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు. కౌంటింగు పూర్తయ్యే వరకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ పిన్నెల్లి, బెయిల్ ఇస్తే కౌంటింగు నాడు అల్లర్లకు పాల్పడే ప్రమాదం ఉన్నందున బెయిల్ ఇవ్వరాదని పోలీసులు, బాధితులు ప్రతివాదన చేశారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును మంగళవారం వెలువరిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

తొలుత పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది టి నిరంజన్‌రెడ్డి వాదిస్తూ, ఓట్ల లెక్కింపు అయ్యే వరకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలింగు ఏజెంట్లను నియమించుకోవాల్సిన అవసరం ఉందని, పోలీసులు అరెస్టు చేస్తే దాని ప్రభావం ఎన్నికలపై పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఇవిఎంల కేసులో జూన్ 6 వరకు అరెస్టు చేయకుండా ఇదే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. అదేవిధంగా పోలీసులు అక్రమంగా నమోదు చేసిన హత్యాయత్నం, ఇతర కేసుల్లో తాత్కాలిక రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఏ విధమైన షరతులు విధించినా అమలు చేసేందుకు పిటిషనరు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఫిర్యాదుదారు నంబూరి శేషగిరిరావు, చెరుకూరి నాగ శిరోమణి తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాదించారు. బెయిల్ ఇస్తే పోలింగ్ రోజు మాదిరిగానే కౌటింగ్ రోజున కూడా దౌర్జన్యాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయన్నారు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేలా ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు.

రోడ్లు రక్తసిక్తం

వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి), నెల్లూరు, గన్నవరం (కృష్ణా జిల్లా)

రాష్ట్రంలో సోమవారం రోడ్లు రక్తసిక్తం అయ్యాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. వీరిలో మన రాష్ట్రానికి చెందిన నలుగురు, తమిళనాడుకు చెందిన నలుగురు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం నరసారావుపురం గ్రామానికి చెందిన అడిగోపుల నీరజను ఆరోగ్యం బాగోలేకపోవడంతో చెన్నయ్‌లోని రాయవేలూరు సిఎంసి వైద్యశాలకు కారులో తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో ఎం.కొంగరవారిపల్లి వద్ద కారు డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్ మధ్యలోని కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా గంగపట్నం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ షమీర్ బాషా (30), కారులో ప్రయాణిస్తున్న మనుబోలు మండలానికి చెందిన నీరజ తల్లి పద్మమ్మ (50), నరసాపురం గ్రామానికి చెందిన అడిగోపుల జయంతి (45), అడిగోపుల శేషయ్య (47) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వారి మృతదేహాలను పోలీసులు అతికష్టంపై కారు నుంచి వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన అడిగోపాల శ్రీనివాసులు, అడిగోపుల నీరజలను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. తమిళనాడుకు చెందిన స్వామినాథన్ (40) తన కుటుంబసభ్యులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుండి తమ ఊరికి కారులో వెళ్తున్నారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఆ కారు అదుపు తప్పి డివైడర్‌ను, రోడ్డు అవతల ఎదురుగా వస్తున్న ఐరన్ లోడు లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. స్వామినాథన్, ఆయన పిల్లలు రాకేష్ (12), రాధప్రియ (14), సమీప బంధువు గోపి (23) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన స్వామినాథన్ భార్య సత్యను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. కృష్ణా జిల్లా ఎస్‌పి ఆద్నాల్ హష్మి, డిఎస్‌పి జైసూర్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు.

తిరుపతి జిల్లా ఎం.కొంగరవారిపల్లి వద్ద కారు నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు

గుజరాత్‌లో గోగూండాల ఘాతుకం
- ముస్లిం కార్మికుడి హత్య
- మూకదాడిగా కేసు నమోదుకు పోలీసుల నిరాకరణ

ఇంట్రాడేలో సెన్సెక్స్ 76వేల మార్క్
- తుదకు @ నష్టాలతో ముగింపు

రఫాలో సహాయక శిబిరాలపై దాడులు
- పిల్లలు, మహిళలతోసహా 45 మంది సజీవ దహనం

• లోపలి పేజీలో..•

ఈసారి వానలే వానలు!

- 31నే కేరళకు రుతుపవనాలు
- భారత వాతావరణ శాఖ అంచనాలు

న్యూఢిల్లీ : ఈసారి కరువుతీరా వానలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. వర్షాధారంపై ఎక్కువగా ఆధారపడే ప్రాంతాలకు ఈ సారి ఆశాజనకమైన పరిస్థితి ఉంటుందని వాతావరణ విభాగం సంకేతాలిచ్చింది. ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కన్నా అధికంగా వర్షాలు పడతాయని భావిస్తుండగా, వాయవ్య ప్రాంతంలో సాధారణంగాను, మధ్య, దక్షిణ భారతాల్లో సాధారణం కంటే అధికంగాను వానలు కురుస్తాయని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్ మీడియా గోష్టిలో వెల్లడించారు. అనుకున్న ప్రకారమే ఈనెల 31న కేరళను రుతుపవనాలు తాకేందుకు ప్రస్తుత పరిస్థితులు సానుకూలంగా వున్నాయన్నారు. నాలుగు నెలల పాటు (జూన్ నుండి సెప్టెంబరు వరకు) సాగే వర్షాకాలంలో 106శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని ఐఎండి పేర్కొంది. సుదీర్ఘ కాల సగటు వర్షపాతం 87సెంటిమీటర్లు వుంది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లు ప్రధానంగా వర్షపాతం మీదే ఆధారపడే వ్యవసాయం సాగించే ప్రాంతాలుగా వున్నాయి. జూన్‌లో (సుదీర్ఘకాల సగటు 166.9 మి.మీ.లో 92-108 శాతం) సాధారణ వర్షపాతం కురిసే అవకాశాలు వున్నాయని అంచనా వేసినట్లు మహాపాత్ర చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో వర్షాలు పడే తీరు కూడా మార్పులకు లోనవుతోంది. సాధారణ వర్షాలు స్థానంలో అధిక వర్షాలు కురియడం ఎక్కువవుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అతివృష్టి లేకుంటే అనావృష్టి ఈ రెండిటివల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముంది.

ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర

52శాతం వ్యవసాయం వర్షాధారమే..

భారతదేశ 52 శాతం దాకా వ్యవసాయం వర్షాధారం మీద ఆధారపడి వుంది.అధిక వర్షాలు కీలకమైన రిజర్వాయర్లు నిండడానికి, జల విద్యుదుత్పాదనకు ఉపయోగకరంగానే ఉన్నా, వరదల వల్ల పంటలు నష్టపోయే ప్రమాదముంది.

కేంద్ర జల సంఘం అందచేసిన సమాచారం ప్రకారం, దేశంలో 150 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత వారంలో అత్యంత కనిష్ట స్థాయికి అంటే 24శాతానికి పడిపోయాయి.. దీనివల్ల చాలా రాష్ట్రాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది.వ్యవసాయానికి జూన్,.జులైలు కీలకమైన మాసాలు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, ఆగస్టు, సెప్టెంబరుల్లో లానినా పరిస్థితులు నెలకొనవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1951-2023 కాలంలో డేటాను పరిశీలించినట్టైతే, లానినా తర్వాత ఎల్‌నినో ఏర్పడిన 9 సందర్భాల్లోనూ సాధారణం కంటే అధికంగానే వర్షపాతం నమోదైంది. 22 లానినా సంవత్సరాల్లో 20 సంవత్సరాల్లో సాధారణం లేదా సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి.

బెంగాల్‌లో 'రెమాల్' బీభత్సం
- ఆరుగురి మృతి

7

కందుకూరి ఆశయాలు మునుముందుకు..

- 105వ వర్ధంతి సభలో వక్తలు
- 105కుపైగా సంఘాల ఆధ్వర్యాన నిర్వహణ

కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

కందుకూరి వీరేశలింగం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. ఏలూరులోని సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ, సర్ సిఆర్ రెడ్డి విద్యాసంస్థల తెలుగు విభాగం సంయుక్తంగా 'కందుకూరి 105వ వర్ధంతి సమాలోచన' కార్యక్రమం నిర్వహించాయి. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, సిఆర్‌ఆర్ విద్యా సంస్థలు, మానవత, జన విజ్ఞాన వేదిక, హిందూ యువజన సంఘం, జిల్లా రచయితల సంఘం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం సహా 115 సంఘాలతో కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి పలు కళా ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత జన విజ్ఞాన వేదిక నాయకులు చేతిపై కర్పూరం వెలిగించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల, పుష్పాలతో నివాళులర్పించారు. విజయవాడకు చెందిన ప్రజా గాయకులు ఆకురాతి జగన్, ప్రజానాట్యమండలి గాయకులు పి.మంగరాజు ఆలపించిన గేయాలు అలరించాయి. కళాకారుడు హమీద్ ప్రదర్శించిన కందుకూరి వీరేశలింగం ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సదస్సుకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. 105కుపైగా సంఘాలు, పలువురు కళాకారులు, గాయకులు ఒకే వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఆర్‌రెడ్డి కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం తొలి సంస్కర్త అని పేర్కొన్నారు. సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరుణ మాట్లాడుతూ స్త్రీ విద్య, వితంతు వివాహాల కోసం ఎన్నో కలుపు మొక్కలను ఏరిపారేసిన గొప్ప సైనికుడు, గొప్ప సాహితీవేత్త కందుకూరి అని కొనియాడారు. రిటైర్డ్ ఎస్ఐ ఎం.జాన్‌మిల్టన్ రచించిన 'పోలీస్ స్టేషన్ గురించి తెలుసుకోవాల్సిన విషయాలు' అనే పుస్తకాన్ని రిటైర్డ్ ఎఎస్‌పి భగవాన్‌రాజుతో కలిసి ఆవిష్కరించారు. కె కేశవరెడ్డి రచించిన, హేలాపురి బాలోత్సవం ప్రచురించిన 'కార్యశూరుడు కందుకూరి' అనే పుస్తకాన్ని మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు ఆవిష్కరించారు. కందుకూరి బాటలో మహిళా చైతన్యం మిగతా 2లో

తెలంగాణలో తగ్గిన పట్టభద్రుల ఓటింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. మొత్తం 12 జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 68.65 శాతం పోలింగ్ నమోదైంది. 2021లో ఈ స్థానానికి జరిగిన ఎన్నికల్లో 74 శాతం పోలింగ్ జరగ్గా, ఇప్పుడు సుమారు 5 శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 4,63,839 మంది ఓటర్లకు గాను 3,18,445 మంది 605 పోలింగ్ స్టేషన్‌లలో ఓటు వేశారు. ఉప ఎన్నిక, మూడేండ్ల పదవీకాలమే ఉన్నప్పటికీ అన్ని ప్రధాన పార్టీలు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అత్యధికంగా జనగామ జిల్లాలో 71.60 శాతం పోలింగ్ నమోదవ్వగా, తక్కువగా ఖమ్మంలో 65.64 శాతం మాత్రమే జరగడం గమనార్హం. గత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 73.86 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 66.5 శాతం మందే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

పోలీసుల అదుపులో దోషి బోయ రంగముని

పోక్సో కేసులో జీవిత ఖైదు

- రూ.20 వేల జరిమానా

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్/హోళగుంద

కర్నూలు జిల్లా హోళగుంద పోలీసు స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో దోషికి జీవిత ఖైదు, జరిమానాను కోర్టు విధించింది. ఈ మేరకు కర్నూలు పోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. 2021లో లాక్‌డౌన్ సమయంలో బొమ్మగుండనహళ్లి గ్రామానికి చెందిన బోయ రంగముని ఏడేళ్ల బాలికపై ఇంట్లో ఎవరూ లేనిసమయంలో మూడు రోజుల్లో మూడుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. మూడోసారి బాలిక నొప్పి భరించలేక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లా హోళగుంద పోలీసు స్టేషన్‌లో 235/2021 క్రైమ్ నంబర్‌తో 448, 506 ఐపిసి, పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద 2021 ఆగస్టు 13న కేసు నమోదైంది. పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును సమగ్రంగా విచారించి, దోషిగా నిర్ధారించి రంగమునికి జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమాన విధిస్తూ జడ్జి జి.భూపాల్‌రెడ్డి తీర్పు వెలువరించారు. జరిమాన చెల్లించడంలో విఫలమైతే అదనంగా మూడు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని జడ్జి ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి అయిన అప్పటి ఆదోని డిఎస్‌పి వినోద్ కుమార్, ప్రాసిక్యూషన్ తరపున వాదించిన గోపాలకృష్ణ, కర్నూలు పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వరరెడ్డి, హోళగుంద పోలీసు స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ ఎస్.షేక్షావలిల కృషిని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఏడాదైనా నాణ్యత ఉంటుందా?

- విద్యాకానుక కిట్లకు సుమారు రూ.716 కోట్ల ఖర్చు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న విద్యాకానుక కిట్లలో నాణ్యమైన బూట్లు, బ్యాగులు, బెల్ట్‌లు అందిస్తున్నామని ప్రభుత్వం మాటల్లో చెప్పడం తప్ప చేతల్లో చూపించడం లేదు. గతేడాది నాసిరకంగా ఉన్నాయనే పేరుతో 1,15,056 బ్యాగులు వెనక్కు పంపి కొత్తవి తెప్పించారు. పాఠశాలలు తెరిచే సమయంలో పాఠశాల విద్యాశాఖ అట్టహాసంగా ఈ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తోంది. రానున్న విద్యాసంవత్సరానికి సమగ్రశిక్షా అభియాన్ 35,69,506 జెవికె కిట్లకు ఆర్డర్ ఇచ్చింది. గతేడాది లానే ఈసారి కూడా ఒక్కో కిట్టును సరాసరి రూ.2006కు కొనుగోలు చేస్తోంది. మొత్తం కిట్లకు రూ.716 కోట్లను వెచ్చించారు. పాఠశాలలు ప్రారంభం రోజైన జూన్ 12వ తేదీ నుంచే స్కూల్ బ్యాగులను విద్యార్థులకు అందిస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఇప్పటికే వెల్లడించారు. గతేడాది విద్యార్థులకు అందించిన నెలలోపే బ్యాగులు, బూట్లు చిరిగిపోయాయి. బ్యాగులను పరిశీలించేందుకు క్వాలిటీ సెల్ ఏర్పాటు చేసి తనిఖీ చేసి పంపించినా నాసిరకంగా ఉన్నాయి. బూట్లయితే పిల్లలకు సరిపోని సైజులు ఇచ్చారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 7వ నెంబర్ కాలుసైజు ఉన్నవారికి 6వ నెంబర్, 6వ నెంబర్ ఉన్నవారికి 5వ నెంబర్ ఇచ్చారు. బ్యాగులు, బూట్లను రీప్లేస్ చేసేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడికి, మండల స్టాక్ పాయింట్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది 1,15,056 బ్యాగులు, బూట్లు 2,43,153 పాడైపోయాయని పాఠశాల విద్యాశాఖ తేల్చింది.

2022-23 విద్యాసంవత్సరంలో కూడా నాణ్యత లేని కిట్లను విద్యాశాఖ అందించింది. ఆ ఏడాది ఏకంగా ఆరు లక్షలు చిరిగిపోయాయి. చిరిగిన వాటిని అందించిన కాంట్రాక్టర్లపై ఇప్పటివరకూ ఎటువంటి చర్యలూ లేవు. బ్యాగులు క్వాలిటీపరంగా ఎటువంటి లోపాలు లేకుండా సంస్థ సరఫరా చేసినట్లు విజయవాడ సీపెట్ సంస్థ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సమగ్రశిక్షా చెబుతోంది. దీంతో సరఫరా సంస్థపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశం లేకపోయిందని పేర్కొంది. రానున్న విద్యాసంవత్సరంలో అందించే బ్యాగుల నాణ్యత బాగుందని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ వద్దకు వెళ్లిమరీ కితాబిచ్చారు. బ్యాగు 45 సెంటీమీటర్ల పొడవు, 33 సెంటీమీటర్ల వెడల్పు, 15 సెంటీమీటర్ల లోతు, 0.42 ఎంఎం మందంతో ఉందని చెబుతున్నారు. నోట్‌బుక్స్, ట్యాబ్‌లు, ఇతర వస్తువులను కూడా బ్యాగులో ఉంచడానికి సరిపోయేంత పరిమాణంలో, సంవత్సరకాలంగా ఉండేందుకు సరిపోతుందని తెలిపారు. గతేడాది కూడా ప్రవీణ్ ప్రకాష్ ఇలానే తయారీ సంస్థ వద్దకు వెళ్లి బ్యాగులు, బూట్ల నాణ్యత బాగుందని కితాబిచ్చారు. అయినా నాసిరకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వస్తున్న బ్యాగులన్నా నాణ్యంగా ఉంటాయా లేదా అనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి.

స్కూల్ బ్యాగులు పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

సకాలంలో స్కూల్ బ్యాగులు
: పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

మండల కేంద్రాలకు స్కూల్ బ్యాగులను సకాలంలో చేర్చడానికి చర్యలు తీసుకున్నామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించకుండా బ్యాగులు తయారయ్యే ఫ్యాక్టరీ నుంచి ట్రక్కుల ద్వారా తరలించే ప్రక్రియ సవాళ్లతో కూడుకున్నదని పేర్కొన్నారు.

నోయిడాలోని బ్యాగుల తయారీ కంపెనీ నుంచి సోమవారం బయలు దేరిన ట్రక్కును జెండా ఊపి ప్రారంభించారు. 250 ట్రక్కుల్లో ఫ్యాక్టరీల నుంచి రాష్ట్రానికి తరలిస్తున్నట్లు వివరించారు. బ్యాగుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. నాణ్యత నియంత్రణ బృందానికి, సిబ్బందికి స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

మరో మూడు రోజులపాటు వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు అత్యధిక ఉష్ణోగ్రతలతోపాటు తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం తిరుపతి జిల్లాలో 41.9 డిగ్రీలు, నెల్లూరు జిల్లాలో 41.5, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో 40.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైనట్లు తెలిపారు. మంగళవారం 209 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వుందని వివరించారు. ఇందులో 149 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 160 మండలాల్లో వడగాడ్పులు వీచే పరిస్థితి వుందని తెలిపారు. బుధవారం నాటికి మరింత పెరిగే అవకాశం వుందని, మొత్తం 342 మండలాల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే అవకాశం వుందని పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో 22 మండలాల్లో, విజయనగరంలో 27, పార్వతీపురం మన్యంలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2, విశాఖలో 6, అనకాపల్లిలో 20, కాకినాడలో 18, అంబేద్కర్ కోనసీమలో 7, తూర్పుగోదావరిలో 18, పశ్చిమగోదావరిలో 4, ఏలూరులో 7, కృష్ణాలో 2, బాపట్లలో ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం వుందని తెలిపారు.

సిఎం జగన్‌పై దాడి కేసులో తీర్పు రిజర్వు

ప్రజాశక్తి - విజయవాడ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి కేసు సోమవారం కోర్టులో విచారణకు వచ్చింది. నిందితుడు సతీశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో విచారణ జరిగింది. 8వ అదనపు జిల్లా న్యాయస్థానంలో నిందితుడి తరపు న్యాయవాది సలీం వాదనలు వినిపించారు. సతీశ్‌ను పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తీర్పును న్యాయమూర్తి రిజర్వు చేశారు. దీనిపై మంగళవారం ఉత్తర్వులు వెల్లడించే అవకాశముంది.

ఇంట్రాడేలో సెన్సెక్స్ 76వేల మార్క్

- తుదకు నష్టాలతో ముగింపు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఇంట్రాడేలో ఆల్‌టైం రికార్డ్‌ను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఓ దశలో సెన్సెక్స్ 600 పాయింట్లు పైగా పెరిగి 76,010 గరిష్ట స్థాయికి తాకింది. నిఫ్టీ 22,900 ఎగువన నమోదయ్యింది. మధ్యాహ్నం సమయంలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సెన్సెక్స్ తుదకు 20 పాయింట్లు నష్టపోయి 75,390 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.65 పాయింట్లు తగ్గి 22,932.45 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్-30లో ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎల్‌అండ్‌టి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు విప్రో, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటిసి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బిఎస్‌ఇ మిడ్ క్యాప్ ఆల్ టైం హై 43,985 పాయింట్ల నుంచి 43,784 పాయింట్లకు పడిపోగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ సైతం ఆల్ టైం గరిష్టానికి దూసుకెళ్లి.. చివరకు 0.09 శాతం పతనంతో ముగిసింది.

కందుకూరి ఆశయాలు మునుముందుకు..

(మొదటి పేజీ తరువాయి)

అనే అంశంపై భోజనానంతరం జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ స్త్రీల స్థితి బాగుపడనిదే దేశం బాగుపడదని విశ్వసించిన వీరేశలింగం... బాలికల పాఠశాలలను నిర్మించి మహిళా ఉపాధ్యాయులను నియమించారన్నారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వొరప్రసాద్, సిఆర్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబిఎస్‌వి.ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులు మనమడు గోపాలకృష్ణ మృతి

- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనవడు టంగుటూరి గోపాలకృష్ణ (59) సోమవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో తన కుమారుని ఇంట మృతి చెందారు. ఆకస్మికంగా స్వల్ప అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. గోపాలకృష్ణకు భార్య విజయలలిత, కుమారులు సాయిక్రాంత్, ప్రకాష్ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు హైదరాబాద్‌లో ముగిశాయి. టంగుటూరి ప్రకాశం పంతులు రెండో కుమారుడైన హనుమంతరావు, అన్నపూర్ణాదేవి దంపతులకు ప్రకాశం జిల్లా ఒంగోలులో గోపాలకృష్ణ జన్మించారు. 1993లో కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి, 2016 డిసెంబరు 31న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. చాలాకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే గోపాలకృష్ణ మృతికి పలువురు పాత్రికేయులు నెమ్మాని సీతారామమూర్తి, ఎంవిఎస్ శాస్త్రి, రాధా రమణ గుప్తా జంధ్యం, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, మైనంపాటి సాయి, యువి రత్నం తదితరులు సంతాపం ప్రకటించారు.

రాష్ట్రానికి 20 పారామిలిటరీ బలగాలు

- సిఇఓ మీనా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున విశ్వవిద్యాలయంలో లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా

పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లు, దాడులను దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరగకుండా నివారించేందుకు రాష్ట్రానికి 20 పారామిలిటరీ బలగాలను రప్పిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు ఉన్న వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడెంచల భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు భౌతికంగా రెండుసార్లు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించే అవకాశం కల్పించినట్టు తెలిపారు. పల్నాడులో పరిస్థితులు అదుపులో ఉన్నాయని, పోలింగ్ అనంతరం ఘర్షణలపై తగిన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు రోజున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కౌంటింగ్ రోజున డ్రైడేగా పరిగణిస్తున్నట్టు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి అనుమానితులను, పాత నేరస్తులను నియంత్రించేందుకు ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, నగర కమిషనర్ చేకూరి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిపాలనా భవనం ముట్టడి

- విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు నగరంలో విద్యుత్ ఛార్జీలను పెంచుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ ఉక్కు పరిపాలనా భవనాన్ని సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు కార్మికుల కుటుంబాలు పాల్గొని విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా నినదించాయి. వారినుద్దేశించి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కులో విద్యుత్‌ను ఆదా చేయడానికి ఎన్నో పద్ధతులు ఉన్నాయని, వాటిని కాదని విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమని అన్నారు. చాలా చోట్ల విద్యుత్ సోలార్‌లు ఉండగా.. వాటిని ఉపయోగించకుండా మూలన పడేశారని తెలిపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు జీతాలు సరిగా ఇవ్వడంలో విఫలమైన ఉక్కు యాజమాన్యం, తాజాగా విద్యుత్ ఛార్జీలను పెంచి వారి కష్టాలను రెట్టింపు చేయడం దారుణమన్నారు. 50 పైసలుగా ఉన్న యూనిట్ విద్యుత్ ఛార్జీని రూ.8కి పెంచడం వల్ల వేలాది రూపాయల బిల్లులను కార్మికులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఐద్వా నాయకులు విమల మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్కసారిగా పెద్ద మొత్తంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ చాలా వరకు ఖాళీ అయిపోయాయని, విద్యుత్ ఛార్జీలు పెంచితే మరింత మంది ఖాళీ చేసి బయటకు వెళ్లిపోతారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలో భాగంగానే ఇటువంటి నిర్ణయాలను యాజమాన్యం చేస్తోందన్నారు. ఉక్కు నగరంలోని స్కూల్ ఫీజులను కూడా పెంచుతారన్న విషయం తెలిసి కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ జరుగుతున్న పోరాటంలో ముమ్మందు మహిళలు వేలాదిగా పాల్గొంటారని తెలిపారు.

ఉక్కు పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, ఉక్కు కార్మికులు

పోలీసులు స్వాధీనం చేసుకున్న రాళ్లు, కర్రలు

పల్నాడులో కర్రలు, రాళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-వినుకొండ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో చోటు చేసుకుంటున్న ఘర్షణలు, ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా మారెళ్ళ వారిపాలెం, నూజెండ్ల గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ చేశారు. కర్రలు, గోతాల్లో నింపిన రాళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడ ఏ అలజడులు సృష్టించినా, వివాదాలకు దిగినా, ఘర్షణలకు పాల్పడినా చర్యలు తప్పని సిఐ ఉప్పుటూరి సుధాకర్ హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

షాపుల కుదింపు చర్యలు నిలిపేయాలి

- ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలి : కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌరసరఫరాలశాఖ పరిధిలోని పలు ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ల పరిధిలోని షాపుల కుదింపు చర్యలను వెంటనే విరమించాలని, హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలని ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు ఆర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదయ్ భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ప్రతినిధుల బృందం.. పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి వీరపాండియన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం సిఫార్సుల పేరుతో షాపుల మార్పులు, చేర్పులు చేపడితే హమాలీ కార్మికులకు పని తగ్గిపోవడంతోపాటు ఆదాయం పడిపోతుందని యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదాయం కోసం ఎల్-2 విధానాన్ని తీసుకురావడం సబబు కాదని, తెలంగాణలో ఈ విధానం అమల్లో లేదన్నారు. ఈ ప్రక్రియ సంప్రదాయక ముఠా కార్మికులను హరిస్తుందని, తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్న హమాలీలకు పాయింట్లు కుదింపుతో మరిన్ని కష్టాలు పెరుగుతాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి పాయింట్‌లో మే నెలలో 17 షాపులు తగ్గించారని, జూన్ నెల నుంచి 29 షాపులు తగ్గించేందుకు సన్నాహాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పొదిలిలో 8 షాపులు తగ్గించగా, జూన్ నుంచి మరో 23 షాపులు, దొనకొండలో 19 షాపులు కుదించారని, కనిగిరిలో 36 షాపులు తగ్గించారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు పాయింట్ పరిధిలో 60 షాపులు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పాయింట్‌లో 10, తణుకులో 10, పాలకొల్లులో 12, పెనుమంట్రలో 4 షాపులను కుదించారని తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి పాయింట్‌లో 16 షాపులు, ఆలూరు పాయింట్‌లో 6, నంద్యాల జిల్లా డోన్ పాయింట్‌లో 16 షాపులు కుదించారని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. తమ వినతిపై ఎమ్‌డి వీరపాండియన్ స్పందిస్తూ ప్రస్తుతం ఉన్న పరిస్థితినే కొనసాగిస్తామని, జూన్ నెలలో ఎటువంటి మార్పులు చేయడం లేదని తెలిపినట్లు పేర్కొన్నారు.

16 నెలల వేతన బకాయిలు చెల్లించాలి : ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల 16 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని జెఎసి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వ్యవసాయశాఖలో రైతు సాధికార సంస్థ ద్వారా ఎపి కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ విభాగంలో ఐసిఆర్‌పి, ఎల్-1, ఎల్-2, మాస్టర్ ట్రైనర్లు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వేతన బకాయిలతోపాటు పిఎఫ్, ఇఎస్‌ఐ లీవ్‌లు, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలను వీరికి అమలు చేయడం లేదని నాగేశ్వరరావు తెలిపారు. తమ వినతికి స్పందించిన రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్ జులై నాటికి ఇతర 10 నెలల బకాయిలు చెల్లిస్తామని తెలిపినట్లు నాగేశ్వరరావు వివరించారు.

సీతారామయ్య పాడె మోస్తున్న పిన్నమనేని మురళీకృష్ణ, తదితరులు

సిపిఎం నాయకులు సీతారామయ్య కన్నుమూత

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

మల్లంపాటి సీతారామయ్య (పాతచిత్రం)

కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామ సిపిఎం నాయకులు, ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ మల్లంపాటి సీతారామయ్య (70) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గతంలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య గృహలక్ష్మి, కుమారుడు నారాయణ, కుమార్తె వనజ ఉన్నారు. సీతారామయ్య సిపిఎం గ్రామ శాఖా కార్యదర్శిగా దీర్ఘకాలం ఉన్నారు. ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన చిరు వ్యాపారం చేసుకుంటూనే ఆ ప్రాంతంలో పార్టీ నాయకునిగా నిబద్ధతతో పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థికి ఓటు వేయాలన్న ఆదుర్దాతో అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఆయన పోలింగ్ స్టేషన్‌కు ఆటోలో వెళ్లి ఓటు వేశారు. ఇదే తనకు చివరి అవకాశం కావచ్చునని కూడా ఆయన చెప్పారని స్థానిక నాయకులు తెలిపారు. నిబద్ధత కలిగిన నేత ఇక లేరన్న బాధ తమను ఎంతగానో కలచివేస్తుందన్నారు. పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొని ముందుండి నడిపేవారు. నిజాయితీతో జీవించి పరిసర గ్రామ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. చివరి శ్వాస వరకూ పార్టీలో చిత్తశుద్ధితో పని చేశారు. గత ఏడాది సిపిఎం చేపట్టిన పోలవరం నిర్వాసితుల పాదయాత్ర సూరంపల్లి వచ్చినప్పుడు కూడా ఆయన అనారోగ్యంతో ఉన్నా పాల్గొని కొద్దిదూరం నడిచారు. సీతారామయ్య అంత్యక్రియలు మధ్యాహ్నం జరిగాయి. సిపిఎం రాష్ట్ర నాయకులు పిన్నమనేని మురళీకృష్ణ, కాట్రగడ్డ స్వరూపరాణి తదితరులతోపాటు పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీతారామయ్య మృతికి పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి కన్నుమూత

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి (74) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో ఆమె తుదిశ్వాస విడిచారు. సీతాదేవికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరు మండలం కోడూరు గ్రామం. ముదినేపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి 1985,1994లో టిడిపి నుంచి ఆమె రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్‌టిఆర్ కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. సీతాదేవి భౌతికకాయాన్ని ఆమె స్వగ్రామానికి తరలించి అక్కడే మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యెర్నేని సీతాదేవిది రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం.ఆమె భర్త నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య అధ్యక్షులుగా, కొల్లేరు పరిరక్షణ కమిటీ అధ్యక్షులుగా, కృష్ణా, గోదావరి, పెన్నార్ డెల్టా డ్రెయినేజీ బోర్డు సభ్యుడిగా పని చేశారు. నాగేంద్రనాథ్ గతేడాది కన్నుమూశారు. నాగేంద్రనాథ్ సోదరుడు కీర్తిశేషులు యెర్నేని రాజారామచందర్ రెండు పర్యాయాలు కైకలూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు

పలువురు సంతాపం

సీతాదేవి మృతిపట్ల గవర్నర్ జస్టిస్ మహ్మద్ అబ్దుల్ నజీర్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం ప్రకటించారు. విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. సీతాదేవి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సీతాదేవి భర్త నాగేంద్రనాథ్‌తో కలిసి రైతు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర బిజెపి చేస్తున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1201వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఆర్ఎంహెచ్‌పి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం కొత్తకొత్త కుట్రలకు తెరతీస్తోందన్నారు. సరిగా ముడిసరుకు కొనకుండా ఉత్పత్తిని తగ్గించడం, కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయకపోవడం, నెలనెలా సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వంటి కుట్రలకు పాల్పడుతోందన్నారు. పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, ఎన్నేటి రమణ మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో పార్టీని స్థాపించి కూడు, గుడ్డ, గూడును అందించిన మహనీయులు ఎన్‌టిఆర్ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించడమైందని, ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు పెద్దయెత్తున పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఇంటి వద్దే పింఛన్లు అందించాలి : దేవినేని

సామాజిక పింఛన్లను జూన్ ఒకటిన లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దే అందించాలని టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జగన్‌కు మేలు జరగాలనే కుట్రలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సిఇఒ మురళీధర్ రెడ్డి పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టారని అన్నారు. గత నెలలో బ్యాంకుల్లో వేసిన పింఛన్ నగదును ఎంతమంది తీసుకున్నారో, ఎంతమంది తీసుకోలేదో అన్ని వివరాలనూ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సిఎస్ జవహర్ రెడ్డిని బదిలీ చేయాలని మాజీ ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. జవహర్ రెడ్డి తన కొడుకు, బినామీల పేరుతో రూ.800 కోట్లు విలువ చేసే భూములు కొన్నారని ఆరోపించారు. అతనిని తొలగించి సిబిఐ విచారణకు ఆదేశించాలని కోరారు. తమ పార్టీ అధినేత చంద్రబాబుపై వైసిపి నేత సజ్జల భార్గవ్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఈ మేరకు డిజిపికి సోమవారం ఆయన లేఖ రాశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై చంద్రబాబు దిగ్భ్రాంతి

రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా ఎం కొంగవరం, కృష్ణా జిల్లా కోడూరుపాడు, కాకినాడ జిల్లా రాయవరం వద్ద జరిగిన ప్రమాదాల్లో పది మంది మృతిచెందడంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.

కుక్కల దాడిలో వ్యక్తి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస (పార్వతీపురం మన్యం జిల్లా)

కుక్కల దాడిలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలంలోని బిత్తరపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మరొకరి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

కుక్కల దాడిలో మృతి చెందిన శంకరరావు

బిత్తరపాడు గ్రామానికి చెందిన నీరస శంకర్రావు (39) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళుతుండగా ఆయనపై ఒక్కసారిగా కుక్కల గుంపు దాడి చేసింది. అతని తొడభాగాన్ని కొరికి తినేశాయి. దీంతో శంకర్రావు అక్కడికక్కడే కుప్పకూలారు. గ్రామస్తులు చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళుతుండగా అధిక రక్తస్రావంతో మార్గమధ్యలో ఆయన ప్రాణాలు విడిచారు. అంతకుముందు అదే గ్రామానికి చెందిన రైతు శీర శంకర్రావు పొలం పనులకు వెళ్తుండగా ఆయనపైనా కుక్కల గుంపు దాడి చేసింది. ఆయన చేతిలో ఉన్న కొడవలితో వాటిని ఎదుర్కొని గట్టిగా కేకలు వేయడంతో కుక్కల గుంపు పారిపోయింది. అప్పటికే తీవ్ర గాయాలయిన శీర శంకర్రావును చుట్టుపక్కల వారు గ్రామంలోకి తీసుకువెళ్లారు. కుక్కలను వెంటపెట్టేందుకు గ్రామస్తులు వెళ్లగా మరోపక్క బహిర్భూమికి వెళ్లిన నీరస శంకరరావుపై కుక్కలు దాడికి పాల్పడ్డాయి. నీరస శంకర్రావుకు భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దగ్ధమైన కారు

జనసేన నాయకుడి కారు దగ్ధం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జనసేన నాయకులు కర్రి మహేష్ కారును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీనిపై ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కారును వైసిపికి చెందిన వారే తగల పెట్టారని, ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటనకు పాల్పడ్డారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇంటి ముందు పార్క్ చేసిన కారును తగలబెట్టడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ విద్యను నిలబెట్టుకుంటేనే భవిష్యత్

- కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య
- శేషగిరి వర్ధంతి సభలో విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ విద్యను, బడులకు కాపాడుకుంటేనే పేద విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని శాసనమండలి పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. యుటిఎఫ్ ఉద్యమ నేత కోరెడ్ల శేషగిరి 3వ వర్ధంతి సోమవారం విజయనగరంలోని శేషగిరి విజ్ఞాన కేంద్ర భవనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బాలసుబ్రహ్మణ్యం 'విద్యారంగంలో పరిణామాలు.. సవాళ్లు.. కర్తవ్యాలు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ముందుగా శేషగిరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆకాంక్షిస్తూ శేషగిరి పేరిట సంఘం నిర్మాణమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. విద్యా రంగంలో తీవ్రమైన అసమానతలు ఉన్నాయన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లోని పిల్లలకు ఎక్కువ మార్కులు రావడం వెనుక వారి తల్లిదండ్రుల సామాజిక, ఆర్థిక పరిస్థితులే కారణమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 12 శాతం మంది ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతుండగా.. మన దేశంలో 40 శాతం మంది చదువుతున్నట్టు బ్రిటిష్ కౌన్సిల్ తన రిపోర్టులో పేర్కొందని వివరించారు. మన దేశంలోని విద్యా ప్రమాణాలు మిగిలిన దేశాలకన్నా తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని తెలిపారు. ధనిక కుటుంబాలకు చెందిన 10 శాతం మంది విద్యార్థులు ఇంటర్నేషనల్ స్కూళ్లలో, 40 శాతం మంది మధ్య తరగతి విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో ఉన్నారని, మిగిలిన 50 శాతం మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని వివరించారు. అందువల్లే ప్రభుత్వ విద్యపై ప్రశ్నించే పరిస్థితి లేక ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. కామన్ స్కూల్స్ విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయకుండా ఎన్నికల్లో ఓట్ల కోసం పథకాలను మాత్రమే ఆశగా చూపుతున్నాయని పేర్కొన్నారు. అంతిమంగా నష్టపోయేది పేద విద్యార్థులేనని తెలిపారు. మరోవైపు పాలకుల విధానాల వల్ల విద్య వ్యాపారమయంగా మారిందని విమర్శించారు. ప్రయివేటు విద్యకు అనుగుణంగా విద్యా విధానాలు రూపొందించడం వల్ల త్వరలోనే అదానీ స్కూల్స్ వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. అదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,356 సింగిల్ టీచర్స్ స్కూళ్లను ఎత్తి వేస్తారని తెలిపారు. ఇప్పటికే 26 వేల పోస్టులు కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వమే సర్కారు విద్యపై నమ్మకం లేకుండా చేస్తోందన్నారు. గత ఏడాది ప్రభుత్వ బడుల్లో 3,59,000 మంది విద్యార్థులు తగ్గిపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసి, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రభుత్వ బడులను బతికించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ, ఎపిటిఎఫ్, పిఆర్టియు నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

సంఘ సంస్కరణ ఉద్యమ ప్రాధాన్యత గుర్తించాలి

- ప్రజా సాంస్కృతికోద్యమ రాష్ట్ర నాయకులు సీతారాం

ప్రజాశక్తి - కాకినాడ

సమాజ మార్పును కోరేవారు ముందుగా సంఘ సంస్కరణ ఉద్యమ ప్రాధాన్యతను గుర్తించాలని ప్రజా సాంస్కృతికోద్యమ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. 'తెలుగునేలపై సంఘ సంస్కరణోద్యమాలు' అనే అంశంపై కాకినాడలోని యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు (ఆర్‌విఎన్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సదస్సు నిర్వహించారు. తొలుత రఘుపతి వెంకటరత్నం నాయుడు చిత్రపటానికి మంతెన సీతారాం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీతారాం మాట్లాడుతూ.. భారత సమాజంలో ఉన్న సతీసహగమనం వంటి అమానుష దురాచారాలపై రాజా రామ్మోహన్‌రాయ్ వంటి మహనీయులు సంఘ సంస్కరణ ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. తెలుగు నాట కూడా వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, బ్రహ్మనాయుడు వంటి సంఘ సంస్కర్తలు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో రాత్రి బడులు, స్త్రీ చైతన్యం, ప్రజా కళలు, వివక్షతపై పోరాటం వంటి విషయాల్లో వామపక్ష ఉద్యమం తగిన పాత్ర పోషించిందని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం ముందుకు దూసుకుపోతున్నప్పటికీ ఇంకా మన సంఘంలో సంస్కరించుకోవాల్సినవి చాలా ఉన్నాయన్నారు. ఇటీవల సనాతన ధర్మం పేరుతో సాగిన చర్చ చూశామని పేర్కొన్నారు. ఆమానుషమైన కుల వివక్ష, స్త్రీల పట్ల చిన్నచూపు కొనసాగడం విచిత్రమైన ధర్మమని ప్రశ్నించారు. మత మాటున మూఢనమ్మకాలు పెరగడాన్ని సహించరాదన్నారు. రాజ్యాంగం ప్రకారం శాస్త్రీయమైన ఆలోచన, ఆచరణ పెంపొందించుకోవాలని తెలిపారు. చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోనూ ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయాలన్నారు. రాజకీయ, ఆర్థిక విషయాలతోపాటు సామాజిక, సాంస్కృతిక విషయాల్లోనూ ప్రజాస్వామ్య భావజాలం పెరగాలని పేర్కొన్నారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాం, ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

అధికారంలోకి ఎవరొచ్చినా... అప్పుల తిప్పలే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి ఎవరొచ్చినా ఆర్థికంగా కష్టకాలం తప్పదన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. పాలనను కొనసాగించేందుకు ఇప్పుడు చేస్తున్న అప్పుల కంటే మరింత ఎక్కువగా చేయాల్సివస్తుందని వారు అంటున్నారు. ప్రస్తుతం ఏటా రూ.80 వేల కోట్ల నుండి రూ.90 వేల కోట్ల వరకు అప్పు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో గెలుపుకోసం పోటీ పడి హామీలు ఇవ్వడంతో ఈ రుణం ఏ మూలకూ చాలని పరిస్థితి నెలకొంది. ఆ హామీలను అమలు చేయాలంటే ఏటా మరో రూ.50 వేలకోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో అదనపు ఆదాయం సమకూరకపోతే ఆ మొత్తాన్ని కూడా రుణాల ద్వారానే సమీకరించుకోవాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ప్రతియేటా 10 నుంచి 15 శాతం వృద్ధితో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నారు. 2024-25 బడ్జెట్‌ను కూడా రూ.2.80 లక్షల కోట్లకు దగ్గరగా తీసుకువచ్చారు. రానున్న పరిస్థితుల్లో జూన్. జూలైల్లో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్ మూడు లక్షల కోట్ల రూపాయలకు కూడా చేరిపోతుందన్న భావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

నిరసన శిబిరంలో కార్మికులతో కలిసి పాల్గొన్న సుబ్బరావమ్మ

బేషరతుగా 'జిందాల్' లాకౌట్ ఎత్తివేయాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-కొత్తవలస

విజయనగరం జిల్లా కొత్తవలసలోని జిందాల్ యాజమాన్యం బేషరతుగా లాకౌట్ ఎత్తివేసి కార్మికులకు పని కల్పించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారానికి వందో రోజుకు చేరింది. సుబ్బరావమ్మ శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. పరిశ్రమలో లాకౌట్ ప్రకటించేందుకు మూడు నెలలు ముందుగానే కార్మిక శాఖకు తెలియజేయాల్సి ఉందన్నారు. జిందాల్ యాజమాన్యం అడ్డగోలుగా లాకౌట్ ప్రకటించి కార్మిక జీవితాలతో ఆటలాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 29న డిసిఎల్ వద్ద జరిగిన చర్చలు ఫలప్రదం కావాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో భాగంగా కార్మికులు అక్కడే వంటా వార్పు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు గాడి అప్పారావు, అప్పన్న, పాలెం సర్పంచ్ కోన దేవుడు, జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సరాది భీమయ్య, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడువామాలు, పెదిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడలో అలలు ఎగసిపడి పది మత్స్యకార గృహాలు ధ్వంసం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో సముద్రం సోమవారం కూడా అల్లకల్లోలంగా ఉంది. బంగాళాఖాతంలో రెమాల్ తుపాను నేపథ్యంలో ఉప్పాడలో తీరం వెంబడి మూడు రోజులుగా రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. సోమవారం సుబ్బంపేట నుంచి ఎస్‌పిజిఎల్ వరకూ అలలు ఎగిసిపడ్డాయి. సూరాడపేట, మాయాపట్నంలో గతంలో వేసిన జియోట్యూబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో సముద్రపు నీరు ఇళ్లలోకి చొచ్చుకు వచ్చింది. ఈ రెండు గ్రామాల్లో పది వరకూ మత్స్యకారుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. తీర ప్రాంతంలో బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నామని, తమను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. బీచ్ రోడ్డుపైకి సముద్రపు అలలు ఎగసిపడటంతో ప్రయాణికులు, పెద్దపెద్ద రాళ్లు బీచ్‌రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం
ఫర్మ్స్ సొసైటీస్ & చిట్స్, వారణాసి డివిజన్, వారణాసి
సమాచారం

ఇందుమూలంగా సర్వజనులకు తెలియజేయడమేమనగా, ఎన్నికల కొరకు ప్రొవిజనల్ జాబితా ప్రకారం శ్రీ కాశీ ఆంధ్రాశ్రమం వారి ఆర్య వైశ్య ఆశ్రమం & నిత్యాన్నసత్రం, డోర్ నం..47/195, మజ్జ టాకీస్ ఎదురు బజ్, కెనరా బ్యాంక్ దగ్గర, లక్సా రోడ్, వారణాసి వారి సంస్థ కార్యాలయం ద్వారా ప్రొవిజనల్ మెంబర్‌షిప్ జాబితా (28471 సభ్యులు) విడుదలచేయబడినది. ఒకవేళ ఎవరైన పార్టీ పై జాబితాలో ఏదైనా అభ్యంతరాలు కలిగియున్నచో, వారు 15 రోజుల్లోగా క్రింది సంతకందారుని కార్యాలయంలో ఫోటో తో నోటరీ అఫిడవిట్ ద్వారా కాంక్రీట్ రుజువులు& ఎవిడెన్స్‌తోపాటు అభిప్రాయంను సమర్పించవలసిందిగా కోరబడుచున్నది. సదరు కాలవ్యవధి తరువాత ఏదైనా అభ్యంతరం స్వీకరించబడదు.
గమనిక: పై ప్రొవిజనల్ మెంబర్‌షిప్ జాబితా (28471 సభ్యులు)ను చూచుట కొరకు సంస్థ యొక్క నోటీసు బోర్డు పై అతికించబడినది.
ఆదేశానుసారం
అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫర్మ్స్ సొసైటీస్ & చిట్స్ వారణాసి డివిజన్, వారణాసి

30న గుంటూరులో
జానపద సాంస్కృతిక సంబరాలు

- నాట్స్ అధ్యక్షులు బాపయ్యచౌదరి

ప్రజాశక్తి-గుంటూరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో ఈ నెల 30న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'జానపద - సాంస్కృతిక' సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపూ) తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని గీత రీజెన్సీలో సంబరాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాపయ్య చౌదరి మాట్లాడుతూ 'భాష రమ్యం, సేవే గమ్యం' అనే నినాదంతో చిరకాలంగా తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణతోపాటు, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు ప్రజలకు విద్య, వైద్య, సేవా కార్యక్రమాలు, మహిళా సాధికారిక కోసం స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జానపద కళాకారులు, సాంస్కృతిక కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. తెలుగు ప్రజల సంక్షేమం కోసం నాట్స్ అవిశ్రాంతంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 30న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో జానపద కళాకారులు హాజరై ప్రదర్శనలు ఇస్తారన్నారు. 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, ఐదుగురు కవులు, కళాకారులకు నాట్స్ సేవా పురస్కారాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ ప్రతినిధి కాకుమాను నాగేశ్వరరావు, ప్రజాగాయకులు పి.వి.రమణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఎట్టకేలకు మారేడుమిల్లి ఘాట్‌లో రాకపోకలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్డులో 24 గంటల తరువాత ఎట్టకేలకు రాకపోకలు మొదలయ్యాయి. ఆదివారం సాయంత్రం చింతూరు నుంచి మారేడుమిల్లి వైపు వెళ్తున్న ఓ భారీ వాహనం సాంకేతిక లోపంతో ఘాట్‌రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో, ఘాట్ రోడ్డుకు రెండువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు, పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి వేళ వారికి నిద్రాహారాలు కరువయ్యాయి. కొంత మంది ఆకలితో ఇబ్బంది పడ్డారు. చివరకు నెల్లిపాక నుంచి భారీ క్రేన్‌ను తీసుకొచ్చి వాహనాన్ని పక్కకు తీశారు. దీంతో సోమవారం సాయంత్రం నుంచి రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఘాట్ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన భారీ వాహనం ఇదే..

కార్డన్ సెర్చ్‌లో 2,602 వాహనాలు సీజ్

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్డన్ సెర్చ్ సత్ఫలితాలను ఇస్తోందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించిన కార్డన్ సెర్చ్ వివరాలను సోమవారం ఆయన ఒక ప్రకటన ద్వారా వివరించారు. రాష్ట్రంలోని 502 ప్రాంతాల్లో ఈ కార్డన్ సెర్చ్‌ను నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 2,602 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఏడుగురికి 41ఎ సిఆర్‌పిసి నోటీసులిచ్చి మరో 23 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. 307 లీటర్ల మద్యం, 46 లీటర్ల ఎన్‌డిపిఎల్ లిక్కర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే ఒక నాటు తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి వాడే 93,600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్‌పిలకు డిజిపి ఆదేశాలు జారీ చేశారు.

డెన్వర్‌కు మహేష్‌బాబు సరికొత్త ప్రచారం

హైదరాబాద్ : ప్రముఖ పురుషుల పర్‌ఫ్యూమ్ బ్రాండ్ అయిన డెన్వర్ హీరో మహేష్ బాబుతో సరికొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. విలువల కంటే విజయాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చే దృక్పథంతో తాజా ప్రకటన మార్పును ప్రోత్సహిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. సామాజిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పుతుందని హామిల్టన్ సైన్సెస్ ఎండి, సిఇఒ సౌరభ్ గుప్తా పేర్కొన్నారు.

THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala.
ZONAL OFFICE: 1st Floor, Halcyon Complex, No.9, St Marks Road, Bangalore-560 001.
e-mail: bgrr-cpc@federalbank.co.in Phone: 080-22074610/604/613/624/625

BGRR/PvtSale/2024-25 NOTICE FOR PRIVATE SALE OF GOLD 27/05/2024

Notice is hereby given for the information of all concerned that Gold Ornaments pledged in the following Gold Loan accounts, with the under mentioned Branches of the Bank, which are overdue for redemption and which have not been regularized so far in spite of repeated notices, will be put for Private sale, in the respective Branches on any date after 10-06-2024 as shown below:

Br. Anakapalle: Door no 12-4-61, Lakshmi Narayana Towers, Pudimadaka Road, Beside Ramalayam, Anakapalle, Visakhapatnam District, Andhra Pradesh - 531 001, Ph. No. 08924-222910:- 13536400033674,13536400034656,13536400033898.
Br. Anantapur: Ganesham Enclave, Ground Floor, Old no: 18-77, TS No:1924-1&1925, Uma Nagar, Old Town, Ananthapur- 515 001 Ph- 9515301985 :- 23416400002060,23416400000643,23416400007457.
Br. Bhimavaram: First Floor, Viyaan Plaza, D No: 1-1-11, Vamsi Krishna Nagar, Opp. Sita Towers, JP Road, Bhimavaram, West Godavari-Disrict, Andhra Pradesh- 534 202, Ph no. 08816 231000 :- 22796400039209,22796400047459,22796400045826,22796400040207,22796400047442,22796400040199,22796400047012,22796400039050,22796400047491.
Br. Budampadu : Door No 165/A4, Near Ramalayam, Budampadu Village, Guntur, Andhra Pradesh - 522 017 :- 22486400043845,22486400057233,22486400046525,22486400049941,22486400054560,22486400043829,22486400050436,22486400049099,22486400050105,22486400050634.
Br. Gajuwaka: D.NO:10-3-3, Kailash Nagar, 60 Feet Road, Old Gajuwaka, Vishakhapattanam- 530 026, Ph no.0891-2709828 :- 16876400048919,16876400050303,16876400051913,16876400047713,16876400054693,16876400048885,16876400053190,16876400023748,16876400048414,16876400048604,16876400038472,16876400050840,16876400052754,16876400050659,16876400051921,16876400053802,16876400047242,16876400044025,16876400048299,16876400050766,16876400051939,16876400053406,16876400047382,16876400032533,16876400050790,16876400050782,16876400046970,16876400052564,16876400052267,16876400051871,16876400052408,16876400050808,16876400055674,16876400055468,16876400056987,16876400056524,16876400047242,16876400052838,16876400050915.
Br. Vijayawada: Door No.29-7-50,Ground Floor, Ramakrishna Towers, Prakasam Road, Suryaraopet, Vijayawada- 520 002, Ph no. 0866-2436163 :- 11526400098753,11526400086956,11526400098068,11526400094950,11526400101078,11526400070570,11526400067212,11526400100237,11526400090958,11526400101276,11526400070596,11526400096906,11526400088333,11526400084001,11526400101235,11526400070604,11526400094018,11526400078672,11526400095304,11526400084480,11526400070620,11526400094125,11526400082278,11526400095452,11526400095635,11526400072816,11526400094257,11526400086972,11526400095486,11526400097250,11526400078391,11526400076437,11526400094620,11526400095601,11526400084639,11526400067535,11526400076445,11526400094638,11526400095619,11526400101920,11526400077237,11526400094240,11526400097805,11526400095627,11526400094711,11526400086709,11526400096880,11526400094703,11526400095593,11526400069416,11526600003199,11526400095932.
Br. Vijayawada/Patamata: Door.No: 59-14-1/2, Below Sankar Netralaya Hospital, Myneni Centre, Patamata, Vijayawada, Krishna, Andhra Pradesh- 520 010, Ph no.0866-24775442:- 14606400189575,14606400133037,14606400194344,14606400168454,14606400189583,14606400182786,14606400196133,14606400176531,14606400189591,14606400188445,14606400189179,14606400190052,14606400189625,14606400157408,14606400194369,14606400179907,14606400152789,14606400186084,14606400190706,14606400180574,14606400190060,14606400152599,14606400150387,14606400192009,14606400190680,14606400182315,14606400181895.
Br. Visakhapatanam: D. No: 12-1-16, Naga Chambers, Waltair Main Road, Vishakhapatnam- 530 002, Ph no. 0891-2744377 :- 12356400026649,23526400002561,12356400021780,12356400026722,12356400026656,23526400004484,12356400025781,12356400026730,12356400021517,12356400026847,12356400025799,12356400026748,12356400021525,12356400027423,12356400022259,12356400027555,12356400023976,12356400022556,12356400021772,12356400026227,12356400023984,12356400026441,12356400020006,12356400026243,12356400024859,12356400021178,12356400025302,12356400026789,12356400026490,12356400025336,12356400025310,12356400026797,12356100490269,12356400025807,12356400025328,12356100491929,12356100491119,12356400021160,12356400023562,12356400023794,12356100491515,12355500004274,12356400026912,12356400023687,12356100492117,12356400023471,12356400024909,12356400024776,12356100492786,12356400027886,12356400019933,12356400026805,12356100492968,12356400023588,12356400025773,12356400026813,12356100493024,12356400023612,12356400028058,12356400027100,12356100493289,12356400025633,12356400026524,12356400022606,12356400026300,12356400026284,12356400026532,12356400025427,12356100493354,12356400026888,12356100490939,12356400025468,12356400026342,12356400026896,12356400016012,12356400026045,23526400002553,12356400021491,12356400019230.
Br. Visakhapatnam / NAD : Door No. 58-1-426, S. No. 23/1D1, Shanthi Nagar, Butchirajupalem, NAD - Kotha Road, Visakhapatnam, Andhra Pradesh - 530009 :- 23976400011031, 23976400014183, 23976400011197, 23976400010967,23976400011122, 23976400004937, 23976400005926, 23976400011155,23976400011189, 23976400014258, 23976400011122.
Br. Atmakuru: D.No. : 3-224/15, Vijetha EM High School Road, Ganapathi Nagar, Atmakur, Guntur- 522 503 :- 22506400037586.
Br. Ananthavaram: Siri Towers, Ananthavaram Village, Thullur Mandal ,Guntur- 522 236, Ph no. 08645281128 :- 22786400018378,22786400024509,22786400020978,22786400023949,22786400024517,22786400023717.
Br. Chittoor : 20-543/2, Sri Balaji Complex, Opp. Raghava Theatre, Jailkhana Road , Mittoor, Chittoor- 517 001, Ph no.0 8572-229177 :- 16736400095213,16736400092533,16736400093010,16736400094455,16736400094745,16736400094885,16736400094976,16736400095999,16736400096294, 16736400096963.
Br. Guntur: D.No.6-14-36, 14th Lane, 1st Cross, Arundel Pet, Guntur - 522 002, Ph no. 0863-2332277 :- 16716400068162,16716400068170,16716400068154,16716400057025,16716400070093,16716400070051,16716400070184,16716400070192,16716400070200,16716400079821.
Br. Kadapa: # 21/648-1, Prasad Towers, Salf Felf Street (Old Municipal Office Road), Near Ramesh Theater, Kadapa, Cuddapah, Andhra Pradesh-516001 :- 23246400009769, 23246400007417, 23246400010171, 23246400009710, 23246400010197, 23246400010726, 23246400012698.
Br. Kurnool: Plot No. 14, SY NO.714/A, Nagi Reddy Revenue Colony, Beside Vijaya Hospital, Rajeswari Nagar, Kurnool-518002, Ph: 0851-274331 :- 22986400009688, 22986400009837, 22986400009993.
Br. Tirupati: D.No.6-7-587, A K Nilayam, Sripuram Colony, Iskcon Road, Tirupati- 517 507 Ph: 91-877-2231361 :- 16836400069893,16836400074679,16836400074687,16836400077557,16836400069323,16836400069331,16836400072764,16836400072954,16836400075809,16836400069752.
Br. Gosala: D.No. 8-149, RS No.33/2, Raja Gari layout, Kobbari Thota, Gosala Village, Penamaluru Mandal, Krishna District- 521 151, Ph: 086628 22080:- 22636400057183,22636400056920,22636400031667,22636400057357,22636400056607,22636400056904,22636400055849,22636400057266,22636400055708,22636400056490,22636400053877,22636400051277,22636400054966,22636400056706,22636400054412,22636400056755,22636400056805,22636400058454.
Br. Rajahmundry: D No 35-2-1, Kepee Arcade, Kanchumarti vari Street, Opp Big Mosque, Rajamundry, East Godavari- 533 101, Ph No. 91-883-2461457 :- 13416400033570,13416400041854,13416400039981,13416400045665,13416400045673,13416400045764.
Br. Krishnayapalem: Near Door No. 1-57, Oppo. Panchayath Office, Krishnayapalem, Mangalagiri Mandal, Guntur, Andra Pradesh- 522 503 Ph: 08645 259113 :- 22866400011506,22866400023758,22866100003175.
Br. Srikakulam: D.No: 5-7-6, Ground Floor, Krishna Park Junction, Srikakulam, Andhra Pradesh- 532001 Ph: 7012045140 :- 23436400007075,23436400006317,23436400012638,23436400012091,23436400009097,23436400010780,23436400012844,23436400008180,23436400010582,23436400009550,23436400014923,23436400014477,23436400004148,23436400009592,23436400015227,23436400014881,23436400006267,23436400015433,23436400003033,23436400013040,23436400011093,23436400011580,23436400004973,23436400008487,23436400011101,23436400018619,23436400007984,23436400020425,23436400016985,23436400010681,23436400007992,23436400020433,23436400016993,23436400011051,23436400005582,23436400020854,23436400017843,23436400011143,23436400007448,23436400020748,23436400002977,23436400010160,23436400012794,23436400021431,23436400010525,23436400017140,23436400009204,23436400020771,23436400010533,23436400010954,23436400011457,23436400020730.
Br. Visakhapatnam / Madhurawad : HIG -1262,PM Palem, Madhurwada, Visakhapatnam, Andhra Pradesh- 530 041 :- 23526400002553,23526400002561,23526400004484,23526400002876,23526400003783,23526400005382.
Br. Prodattur : Door No.22/296, Gandhi Road, Revenue Ward No.22, Prodattur, Andhra Pradesh, Cuddapah- 516 360 :- 23716400000489,23716400001594,23716400002451,23716400004929,23716400005280.

Bangalore 27-05-2024 Vice President & Zonal Head

సంపాదకీయం

విభజన గోస

సుదీర్ఘ ప్రజా ఉద్యమాలతో సిద్ధించిన తొలి భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ విభజన స్వాతంత్ర్యానంతర దేశ చరిత్రలో విషాదంకాగా, నాడు కేంద్రం ఇచ్చిన విభజన హామీలు పదేళ్లయినా ఇప్పటికీ పెండింగ్‌లోనే మగ్గడం పార్లమెంట్‌కు, చట్టానికి పాలకులు చేసిన అవమానం. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం. పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపర్చిన హామీలకు పదేళ్ల కాలపరిమితి విధించగా, ఆ గడువు జూన్ 2 తో ముగుస్తోంది. అప్పటితో చట్టంలోని ఆ భాగం చెల్లని చీటీ అవుతుందా, లేదంటే గడువు పొడిగిస్తారా అనేది కేంద్రం చేతిలో ఉంది. ఇప్పుడున్న మోడీ కేబినెట్ అత్యవసర ఉత్తర్వు (ఆర్డినెన్స్)తో గడువు పొడిగించొచ్చు. లేదంటే కొత్త ప్రభుత్వం కొలువుతీరాకైనా ఆర్డినెన్స్, పార్లమెంట్‌లో బిల్లు ద్వారా కాలపరిమితి పొడిగించొచ్చు. అన్ని విధాలుగా నష్టపోయిన విభజిత రాష్ట్రం కాలు కూడదీసుకొని నిలబడటం కోసమే పలు హామీలిచ్చారన్న వాస్తవాన్ని విస్మరించడం ద్రోహమే. హామీల్లో అతి ప్రధానమైనది ప్రత్యేక హోదా. అది ముగిసిన అధ్యాయమని మోడీ సర్కారు తేల్చేసింది. చట్టంలోనే జాతీయ హోదా కల్పించిన పోలవరం ప్రాజెక్టుపై కేంద్రానిది అన్నీ కిరికిరీలే. రెవెన్యూలోటు సర్దుబాటు తీరిగ్గా తొమ్మిదేళ్లకు క్లియర్ చేసింది. ఫీజిబులిటీ లేదని కడప ఉక్కుకు ఎగనామం పెట్టింది. రైల్వే జోన్ గాలిలో ఉంది. విద్యాసంస్థల ఏర్పాటు అరకొరే. పారిశ్రామిక కారిడార్లు, పెట్రో కెమికల్ ప్రాజెక్టులు, మెట్రో రైళ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు..అన్నీ దిగదుడుపే. చివరికి విభజన జరిగి దశాబ్దం గడిచినా రాజధాని లేని రాష్ట్రంగా 'ఖ్యాతి'కెక్కడం ఢిల్లీ ఏలికల చలవేనన్నది దాచినా దాగని సత్యం.

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంచాయితీ పదేళ్లయినా పేరబెట్టడం కేంద్రంలో బిజెపి సర్కారు, రాష్ట్రంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాల వైఫల్యమే. విభజన చట్టంలోని తొమ్మిది, పది షెడ్యూళ్లలో పొందుపర్చిన 196 సంస్థల్లో పలు సంస్థలకు చెందిన ఆస్తుల పంపిణీ ఇంకా జరగలేదు. వందలాది ఉద్యోగుల పంపిణీ పెండింగ్‌లో ఉంది. ఆర్‌టిసి వంటి పెద్ద సంస్థల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎ.పి.కి రావాల్సి ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రూ.8 వేల కోట్ల విద్యుత్ బకాయిలు తెలంగాణ నుంచి రావాలని ఎ.పి. సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. నీటి గొడవలు తెలిసిందే. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు నీటి పంపకాలపై రెండు రాష్ట్రాల మధ్య తరచు ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. కానీ కేంద్రం సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే బదులు విద్వేషాలు రెచ్చగొడుతోంది. పెత్తనాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకొని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. ఇది అత్యంత హేయమైనది. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం. అంతర్జాతీయ జల న్యాయ సూత్రాలలోని లోయర్ రైపేరియన్ రైట్స్ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతాయి. వాటిని పరిరక్షించాల్సిందే.

ఎ.పి. విభజన కాంగ్రెస్, బిజెపి కూడబలుక్కొనే చేశాయి. కాబట్టి హామీలు నెరవేర్చే విషయంలో ఆ రెండు పార్టీలకూ బాధ్యత ఉంటుంది. ఈ పదేళ్లూ కేంద్రంలో బిజెపినే అధికారం వెలగబెట్టింది. ఆ ప్రభుత్వమే విభజన హామీల తాత్సారానికి ప్రధాన ముద్దాయి. బిజెపి వంచనను నిలదీసి ప్రశ్నించే విషయంలో రాష్ట్రంలో తొలి ఐదేళ్లూ అధికారంలో ఉన్న టిడిపి, తర్వాతి ఐదేళ్లూ పాలన చేసిన వైసిపి అవకాశవాదంతో వ్యవహరించాయి. అందుకే విభజన జరిగి పదేళ్లయ్యాక కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. ఎ.పి., తెలంగాణ మధ్య నీటి పంపకాలు, ఉద్యోగుల కేటాయింపులు, ఆస్తుల పంపిణీ.. ఇవన్నీ ఇరువురి మధ్య చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి. పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చట్టంలో పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లోనే ఆ గడువు ముగుస్తుందన్న ఆందోళనను కొందరు లేవదీశారు. ఈ విషయంలో బిజెపి సహజంగానే ముందుంటుంది. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలపై సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేస్తానని మొన్ననే తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల అనంతరం త్వరలో ఎ.పి.లో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా అటువంటి పంథానే అమలు చేయాలి. మాటల్లో మాత్రమే గాక చేతల్లోనూ అదే స్ఫూర్తితో రెండు రాష్ట్రాలూ కేంద్ర బిజెపి కుయుక్తులను తిప్పికొట్టాలి. తెలుగు ప్రజల ఐక్యతను నిలబెట్టాలి.

మహనీయుల మాట

భారతీయ మహిళలను వాణిజ్య ప్రకటనలకు సరుకులుగా మార్చే క్రమంలోనే వారిని ఆ సరుకులకు వినియోగదారులుగా కూడా తయారు చెయ్యడం గొప్ప విచిత్రం. లావాదేవీకి రెండు వైపులా వున్నది మహిళలే. మన దేశంలో అనే కాదు. ప్రపంచంలో ఎక్కడ చూసినా జరుగుతున్నది ఇదే.

- అర్పితా గుహ ఠాకుర్తా

పేదరికాన్ని పెంచిన నయా ఉదారవాదం

విశ్లేషణ

ఉత్సా పట్నాయక్

గత మూడు దశాబ్దాలుగా అమలు జరుగుతున్న నయా ఉదారవాద విధానాల ఫలితంగా మూడవ ప్రపంచ దేశాలలోని కోట్లాది మంది ప్రజలు పేదరికం నుంచి బైటపడ్డారంటూ ప్రపంచ బ్యాంకు, ఆ యా ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. మీడియా యావత్తు ఈ ప్రచారంతో హోరెత్తిపోతోంది. 2022-23 నాటికి భారతదేశంలో కేవలం 5 శాతం మంది మాత్రమే పేదలు ఉన్నారని, మన దేశం దాదాపుగా పేదరికం ఏమీలేని దేశంగా మారిందని ఈ ఏడాది మొదట్లో నీతి ఆయోగ్ ప్రకటించింది. ఐతే, ప్రజలు పొందగలుగుతున్న పౌష్టికాహారపు గణాంకాలు మాత్రం గత మూడు దశాబ్దాల కాలంలో ఆకలిగొన్నవారు విపరీతంగా పెరుగుతున్నారని సూచిస్తున్నాయి. కనీస స్థాయిలో అవసరమైన శక్తినిచ్చే ఆహారాన్ని, మాంసకృతులను పొందలేక పోతున్నవారు పట్టణాలలో గాని, గ్రామాలలో గాని మూడింట రెండొంతులకు పైనే ఉన్నారని ఆ వివరాలు సూచిస్తున్నాయి. ఇక 125 దేశాలకు చెందిన ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశం 111వ స్థానంలో అట్టడుగున ఉంది. ఆరోగ్యానికి సంబంధించి కొన్ని సూచికలలో మెరుగుదల ఉన్నా, మరికొన్ని క్షీణించాయి.

ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తున్న లెక్కల్ని నిజమని నమ్మేవారు కొందరు 'పేదరికమే తగ్గిపోతున్నప్పుడు ఆకలి పెరుగుతోందని ఎలా చెప్పగలం' అని అడుగుతున్నారు. కాని నిజానికి ఈ ప్రశ్న అటు నుంచి ఇటు అడగాలి. 'ఆకలి పెరుగుతున్నప్పుడు పేదరికం తగ్గిపోయిందని ఎలా చెప్పుకోగలం?

ఆకలికి సంబంధించిన గణాంకాలు నేరుగా సేకరించినవి. వాటిని సరైనవో కావో నిర్ధారించడం కూడా తేలికే. కాని పేదరికం గురించి వేసిన అంచనాలు అలా కాదు. ప్రభుత్వ లెక్కలు తర్క విరుద్ధంగా, పారదర్శకత లేనటువంటి పద్ధతులను అనుసరించి రూపొందించినవి. అందుచేత పేదరికం తగ్గిపోయినట్టు చెప్పుకునే లెక్కలు విశ్వసనీయత లేనివి. ఈ బూటకపు అంచనాల పద్ధతికి ప్రపంచ బ్యాంకు ఆమోదం కూడా ఉంది. అందుకే ఆ సంస్థ కూడా పేదరికం తగ్గిపోయిందంటూ ఆ పలుకులే వల్లిస్తోంది.

ప్రభుత్వం అధికారికంగా అనుసరిస్తున్న పద్ధతులు విశ్వసనీయమైనవి కావు అని ఎలా చెప్పగలుగుతున్నాం? కొన్ని సంవత్సరాలుగా దారిద్ర్యరేఖను నిర్ధారించడంలో తక్కువ అంచనాలు వేయడం జరుగుతోంది. కనీస పౌష్టికాహార స్థాయిని క్రమంగా తగ్గించి వేస్తూ వచ్చారు. పేదరికం స్థాయిని కొలిచే ప్రమాణం స్థిరంగా కొనసాగినప్పుడే కొన్ని సంవత్సరాల కాలంలో పేదరికం తగ్గుతోందా లేక పెరుగుతోందా అన్నది అంచనా సక్రమంగా చేయగలుగుతాం. కాని పేదరికాన్ని కొలిచే ప్రమాణాన్ని కూడా తగ్గించివేస్తూ వుంటే అప్పుడు పేదరికం నిజంగా తగ్గిందో లేక పెరిగిందో నిర్ధారించడం ఎలా సాధ్యం? ఉదాహరణకు ఒక స్కూలులో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థులు శాతం 55 శాతం నుండి 95 శాతానికి పెరిగిందని ప్రకటించారనుకుందాం. దానిని బట్టి స్కూలు బోధనా సామర్థ్యం అమాంతం పెరిగిపోయిందనుకోలేం. స్కూలులో కనీసం పాసు మార్కులు 50గా ఉన్నది 15కి తగ్గించారనుకుంటే అప్పుడు 95 శాతం ఉత్తీర్ణత నిజమైన అంచనా అవుతుందా! కనీసం పాసు మార్కులను యథాతథంగా 50 దగ్గర కొనసాగించినప్పుడే గత సంవత్సరంతో పోల్చి ఈ ఏడాది ఉత్తీర్ణత పెరిగిందో లేక తగ్గిందో పోల్చి చెప్పగలం.

పై ఉదాహరణలో కనీస ఉత్తీర్ణతకు నిర్దేశించిన మార్కులను తగ్గించినట్టే ప్రభుత్వం కూడా కనీసం అవసరమైన పౌష్టికాహార విలువలను తగ్గించి వేసింది. 1973-74 నాటికి పట్టణాల్లో 2100 క్యాలరీలు, గ్రామాల్లో 2200 క్యాలరీలు తలసరి శక్తినిచ్చే ఆహారం పొందాలన్నది ప్రతి ఒక్కరికీ ప్రమాణంగా నిర్ణయించారు. అంతకు తగ్గితే పౌష్టికాహార లోపం ఉన్నట్టు పరిగణించారు. కాని నాలుగు దశాబ్దాలు గడిచాక చాలా రాష్ట్రాల్లో 1700 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం పొందగలిగితే పౌష్టికాహార లోపం లేనట్టుగా లెక్కించడం అమలులోకి వచ్చింది. టెండూల్కర్ కమిటీ సిఫార్సులు ఆ విధంగా ఉన్నాయి. ఇప్పుడు కూడా నీతి ఆయోగ్ ఆ సిఫార్సులనే ప్రాతిపదికగా తీసుకుంటోంది. ఆహారంలో మాంసకృతులది కూడా ఒక ముఖ్యమైన భాగం. అది మరీ తగ్గిపోతోంది.

2011-12లో గుజరాత్‌లో నెలకు రూ.932 కన్నా తక్కువ తలసరి ఆదాయం కలిగిన వారిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టు లెక్కించారు. ఆ లెక్కన గుజరాత్‌లో ఆ ఏడాది 21.9 శాతం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. కాని రూ.932 కనీస తలసరి ఆదాయం ప్రాతిపదికన లెక్కిస్తే తలా 1670 క్యాలరీల శక్తిగల ఆహారం మాత్రమే పొందగలరు. అదే 2200 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం పొందాలంటే నెలకు కనీస ఆదాయం రూ.2000 ఉండాలి. ఆ లెక్కన చూస్తే 2011-12లో గుజరాత్ జనాభాలో 87 శాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్టు తేలింది.

అదే గ్రామీణ పంజాబ్‌లో 7.71 శాతం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టు ప్రకటించారు. కాని ఆ ప్రాతిపదికన పొందగలుగుతున్నది 1800 క్యాలరీల ఆహారం మాత్రమే. 2200 క్యాలరీల ప్రాతిపదికన లెక్కిస్తే పేదరికం 38 శాతం ఉన్నట్టు తేలింది. 2009లో పుదుచ్చేరి గ్రామీణ ప్రాంతంలో పేదరికం కేవలం 0.2 శాతం (అంటే దాదాపు పేదరికం ఏమీ లేనట్టే అనుకోవాలి) ఉన్నట్టు ప్రకటించారు. అప్పుడు ఉపయోగించిన ప్రమాణాలను బట్టి చూస్తే కనీస పౌష్టిక ఆహార లభ్యత 1040 క్యాలరీలుగా మాత్రమే ఉంది. అది దాదాపు అర్థాకలితో బతకడమే. 2200 క్యాలరీల ప్రమాణం ప్రకారం లెక్కిస్తే పుదుచ్చేరిలో 50 శాతం పేదరిక రేఖకు దిగువన ఉన్నట్టు తేలింది. పుదుచ్చేరిలో తీసుకున్న 1040 క్యాలరీల కనీస ప్రమాణం కన్నా తక్కువ స్థాయి ఆహారం పొందుతున్న వారు ఎవరూ లేరు. ఎందుకంటే అంతకన్నా తక్కువ ఆహారం పొందితే వారు జీవించి వుండడం అసాధ్యం. పట్టణ ప్రాంతాలను పరిశీలించినా ఇదే ధోరణి కనపడుతుంది.

నీతి ఆయోగ్ 2023-24లో దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన కేవలం 5 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. దానికి ప్రాతిపదిక టెండుల్కర్ కమిటీ సిఫార్సులు. ఆ కమిటీ నిర్దేశించిన ప్రమాణాలను 2023-24 నాటి ధరలకు అనుగుణంగా సవరించారు. ఆ ప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాలలో కనీస తలసరి రోజు ఆదాయం రూ.57, పట్టణ ప్రాంతాలలోనైతే రూ.69 పొందగలిగితే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నట్టు పరిగణించారు. అందులో ఆహారం నిమిత్తం ఖర్చు కింద గ్రామాల్లో రూ.26.60, పట్టణాల్లో రూ.27.00, ఆహారేతర ఖర్చుల కింద గ్రామాల్లో రూ.30.40, పట్టణాల్లో రూ.42 చొప్పున లెక్కించారు. గ్రామాల్లో ఆహారం నిమిత్తం నిర్దేశించిన ఖర్చు రూ.26.60తో కేవలం 1.3 లీటర్ల మంచి నీరు మాత్రం కొనుక్కోవచ్చు. ఇక ఆహారానికి ఖర్చు చేయడానికి ఏమీ మిగలదు (పేదలు నాజానికి బాటిళ్లలో తాగునీరు కొనరు. ఆహారం కోసం చేసిన కేటాయింపు ఎంత హీనంగా ఉందో చెప్పడానికి మాత్రమే ఈ ఉదాహరణ.) ఇక రోజువారీ ఆహారేతర ఖర్చులు ఉంటే అద్దె, రవాణా ఖర్చు, వైద్యం, నిత్యం ఉపయోగించే ఇతర సరుకులు - వంటి అవసరాలను తీర్చడానికి గ్రామాల్లో రూ.30.40, పట్టణాల్లో రోజుకి రూ.42.00 సరిపోతాయని ఎవరైనా అనుకుంటే వాళ్లు వాస్తవికతతో బొత్తిగా సంబంధం లేకుండాపోయిన వారై వుండాలి. కాని మన అధికారిక అంచనాలు రూపొందించిన వారు ఆ బాపతే. పేదరిక ప్రమాణాలుగా వారు పరిగణిస్తున్నవి నిజానికి నిష్ఠ దరిద్రానికి, అర్ధాకలితో చస్తూ బతుకుతున్నవారికి వర్తించే ప్రమాణాలు. గ్రామాల్లో 6.6 శాతం, పట్టణాల్లో 1.6 శాతం జనాభా నేడు మనుషులుగా బతకలేని హీనస్థితిలో కొనఊపిరులతో ఉన్నారు. ఈ రెండింటి సగటు 5 శాతం అయింది. దానిని నీతి ఆయోగ్ దారిద్ర్యరేఖ అని అంటోంది. కనీస పౌష్టికాహారం పొందగలిగే స్థాయి దీనికన్నా కనీసం రెండున్నర, మూడు రెట్లు ఉంటుంది. రాబోయే రెండు, మూడేళ్లలో దారిద్ర్యమే లేకుండా చేస్తాం అని ప్రకటిస్తున్నారు. అంటే అప్పటికి కనీస ప్రమాణాలను ఇంకా తగ్గించనున్నారని మనం అనుకోవాలి. ఇక అంతకంటే తక్కువ స్థాయిలో ఆహారం పొందితే బతకడం అసాధ్యం అవుతుంది. కనుక దరిద్రులు అనే వారు ఉండరు అధికారుల లెక్కల్లో.

గడిచిన మూడు దశాబ్దాల కాలంలో వాస్తవానికి పేదరికం గణనీయంగా పెరిగింది. 2200 క్యాలరీలు (గ్రామాల్లో), 2100 క్యాలరీలు (పట్టణాల్లో) శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని వారు 1993-94లో 58.5 శాతం గ్రామాల్లో, 57 శాతం పట్టణాల్లో ఉన్నారు. 2004-05 సంవత్సరం నాటికి వారు 69.5 శాతం గ్రామాల్లో, 65 శాతం పట్టణాల్లో అయ్యారు. ఆ ఏడాది కరువు సంవత్సరం. అందుచేత తర్వాత కొంత మెరుగుపడింది. ఐనా 2011-12 నాటికి 67 శాతం గ్రామాల్లో, 62 శాతం పట్టణాల్లో పౌష్టికాహారం పొందలేని వారున్నారు. 2017-18 పౌష్టికాహార లభ్యత గణాంకాలకు విడుదల చేయకుండా తొక్కిపెట్టారు. ఐనా 2011-12 తో పోల్చి ఆహారం కోసం చేసిన ఖర్చును, దానికి లభించే ఆహారపు క్యాలరీలను లెక్కిస్తే గ్రామీణ ప్రాంతంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 80 శాతం పైబడి వుంది. పట్టణాల్లో పరిస్థితి 2011-12 నాటి స్థితిలోనే కొనసాగుతోంది. 2023-24కి సంబంధించి పూర్తి గణాంకాలు ఇంకా వెలువడలేదు. కాని కరోనా ప్రభావం కూడా పరిగణనలోకి తీసుకుంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారి సంఖ్య మరింత పెరుగుతుందే తప్ప తగ్గే అవకాశం లేదు.

ఇటువంటి తప్పుడు ప్రకటనలు ప్రపంచబ్యాంకు గాని, ఆయా ప్రభుత్వాలు గాని ఇవ్వడానికి కారణం వారు అనుసరించిన తప్పుడు తర్కమే. మొదట్లో వారు దారిద్ర్యరేఖ ప్రమాణాన్ని సరిగ్గానే తీసుకున్నారు. కాని ఆ తర్వాత ఆ దారిద్ర్యరేఖను ప్రతీ ఏటా అంచనా వేసేటప్పుడు పౌష్టికాహార ప్రమాణాలను లెక్కలోకి తీసుకోకుండా పక్కనబెట్టారు. 1973-74లో మన దేశంలో కనీసం అవసరమయ్యే 2200 క్యాలరీలు గ్రామాల్లో, 2100 క్యాలరీలు పట్టణాల్లో పొందాలంటే నెలకు తలసరి ఖర్చు రూ.49 గ్రామాల్లో, రూ.56.6 పట్టణాల్లో అవసరమయ్యేవి. ఆ ఏడాది దారిద్ర్యరేఖకు దిగువన 56.4 శాతం గ్రామాల్లో, 49.2 శాతం పట్టణాల్లో ఉన్నారు. కాని ఆ తర్వాత ప్రతీ అయిదేళ్ళకూ తలసరి పౌష్టికాహారం లభ్యతకు సంబంధించిన గణాంకాలు లభిస్తున్నా ఆ వివరాలను లెక్కల్లోకి తీసుకోకుండా పక్కన పెట్టారు.

దానికి బదులు ధరల సూచికకు అనుగుణంగా దారిద్ర్య రేఖకు సవరించుతూ పోయారు. అలా సవరించిన రేఖ ప్రకారం ఎంత మందికి పౌష్టికాహారం కనీస స్థాయిలో లభిస్తోందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. ఒకసారి దారిద్ర్య రేఖను తప్పుగా నిర్ధారించాక, మళ్లీ లెక్క వేసేటప్పుడు ఈ తప్పుడు లెక్కనే ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆ విధంగా చేసిన తప్పునే మళ్లీ, మళ్లీ చేస్తూ పోయారు. 1973-74లో ప్రజలు ఏ ఆహారాన్ని, ఏ ఆహారేతర సేవలను, సరుకులను పొందేవారో, 50 సంవత్సరాల తర్వాత కూడా వాటిని పొందుతున్నారన్న తప్పుడు ఆలోచనతో అధికారుల తర్కం తప్పటడుగులేసింది.

> **ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తున్న లెక్కల్ని నిజమని నమ్మేవారు కొందరు 'పేదరికమే తగ్గిపోతున్నప్పుడు ఆకలి పెరుగుతోందని ఎలా చెప్పగలం' అని అడుగుతున్నారు. కాని నిజానికి ఈ ప్రశ్న అటు నుంచి ఇటు అడగాలి. 'ఆకలి పెరుగుతున్నప్పుడు పేదరికం తగ్గిపోయిందని ఎలా చెప్పుకోగలం? ఆకలికి సంబంధించిన గణాంకాలు నేరుగా సేకరించినవి. వాటిని సరైనవో కావో నిర్ధారించడం కూడా తేలికే. కాని పేదరికం గురించి వేసిన అంచనాలు అలా కాదు. ప్రభుత్వ లెక్కలు తర్క విరుద్ధంగా, పారదర్శకత లేనటువంటి పద్ధతులను అనుసరించి రూపొందించినవి. అందుచేత పేదరికం తగ్గిపోయినట్టు చెప్పుకునే లెక్కలు విశ్వసనీయత లేనివి. ఈ బూటకపు అంచనాల పద్ధతికి ప్రపంచ బ్యాంకు ఆమోదం కూడా ఉంది. అందుకే ఆ సంస్థ కూడా పేదరికం తగ్గిపోయిందంటూ ఆ పలుకులే వల్లిస్తోంది.**

కాని గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రజలు తీసుకునే ఆహారంలో గాని, ఉపయోగించే వస్తువులలో గాని, పొందే సేవలలో గాని పెను మార్పులు చోటుచేసుకున్నాయి. చాలా వేగంగా జరిగిన ఈ మార్పులకు కారణం నయా ఉదారవాద విధానాలు. దాని ఫలితంగా ప్రజలకు లభించే అనేక సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. మార్కెట్లో సరుకుల ధరల మీద ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోయింది. గడిచిన 50 ఏళ్లలో ప్రజల వినియోగంలో చారిత్రకంగా వచ్చిన మార్పులను కాని, మార్కెట్లో వచ్చిన మార్పులను కాని లెక్కలోకి తీసుకోకుండా, కేవలం 50 ఏళ్ల క్రితం వినియోగాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నట్లు భావించి దానిని ధరల సూచికకు అనుగుణంగా సవరిస్తూ పోవడం జరిగింది. ఇదే ప్రభుత్వం చేసిన పెద్ద తప్పు.

వైద్యం, విద్య, గృహ నిర్మాణం, విద్యుత్తు, రవాణా సదుపాయాల వంటి అంశాలను మార్కెట్ పరిధి నుండి మినహాయించి వాటిని ప్రజోపయోగ సరుకులుగా, సేవలుగా పరిగణించినప్పుడు ఆ దేశాల్లో పరిస్థితి వేరుగా ఉంటుంది. అప్పుడు బడ్జెట్‌లో వీటన్నింటికీ తగు కేటాయింపులు చేయాల్సి వుంటుంది. ఉచిత వైద్యం, ఉచిత విద్య, సబ్సిడీ మీద ఇతర సేవలకు అందించవలసి వుంటుంది. గృహ నిర్మాణం సబ్సిడీ మీద చేపట్టవలసి వస్తుంది. రవాణా, తాగునీరు, విద్యుత్తు తదితర సేవలు దాదాపు నామక: ధరలకు అందించవలసి వస్తుంది. అప్పుడు కుటుంబ ఆదాయంలో ఆహారం, కనీస అవసరాలకు చేసే ఖర్చు వాటా తగ్గుతుంది. అప్పుడు పేదరికం తగ్గుతుంది.

ఈ మాదిరిగా విధానాలను అమలు చేయడం ప్రధానంగా సోషలిస్టు దేశాలలో జరుగుతుంది. ఆసియా యూరప్ ఖండాలలోని సోషలిస్టు దేశాలలో ఇది అమలు జరిగింది. అంతేకాదు, రెండవ ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో పశ్చిమ యూరప్ లోని సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కూడా ఈ విధానాలే అమలు జరిగాయి.

కాని నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం మొదలయ్యాక దీనికి పూర్తి వ్యతిరేక దిశలో విధానాలను అమలు చేయనారంభించారు. ఫలితంగా విద్య, వైద్యం, ఇతర సేవలు ప్రభుత్వ బాధ్యతగా కాకుండా మార్కెట్‌లో కొనుక్కోవలసిన సరుకులుగా మారిపోయాయి. వీటికోసం సామాన్యులు చేయవలసిన ఖర్చు అనూహ్యంగా పెరిగిపోవడంతో ఆహారం కోసం చేయగలిగే ఖర్చు కుదించుకు పోయింది.

దీనికి తోడు 2016లో తెలివి తక్కువగా చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, 2021లో కరోనా మహమ్మారి వచ్చినప్పుడు విధించిన లాక్‌డౌన్... పేదరిక సమస్యను మరింత జటిలం చేశాయి.

ఈ పరిస్థితిని చక్కదిద్దడం పెద్ద కష్టమేమీ కాదు. సంపద పున:పంపిణీ చర్యలతో సరిచేయవచ్చు. ప్రజలందరికీ సరిపడా తిండి, వైద్యం, విద్య ఉపాధి హామీ, వృద్ధాప్య సంరక్షణ వంటి అన్నింటినీ అందించడానికి మన జిడిపిలో 10 శాతం చాలు. అందులో 7 శాతం సంపన్నుల మీద అదనపు పన్నులు వేయడం ద్వారా రాబట్టవచ్చు. ఆ మాత్రం అదనపు భారాన్ని వారు తేలికగానే మోయగలరు. 2013లో చేసిన జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని, ఉపాధి హామీ చట్టాన్ని కూడా గట్టిగా అమలు చేస్తే పేదరికాన్ని తొందరగానే తగ్గించవచ్చు.

అంతకన్నా ముందు ఈ తప్పుడు లెక్కల విధానానికి స్వస్తి చెప్పాలి. అప్పుడే వాస్తవ చిత్రం కనపడుతుంది. ఇది మన దేశంలోనే గాక అంతర్జాతీయంగా కూడా జరగాలి.

(స్వేచ్ఛానుసరణ)

ప్రధానిగా పరమాత్మ ప్రతినిధి!

అభిప్రాయం

సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రజాస్వామ్య దేశాలలో పార్లమెంటు సభ్యులు, ప్రధానులు, అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు. కానీ మన ప్రధాన సేవకుడు మోడీ మాత్రం పరమాత్మ ప్రతినిధినని చెప్పుకుంటున్నారు. ఒక వార్తా సంస్థతో, "నేను జీవ సంబంధితుడ్ని కాదు. దైవదత్త శక్తివంతుడ్ని. దేవుడు నన్ను ప్రత్యేక పనికి పంపాడు. 2047కు వికసిత భారత్ సాధించే వరకు ఆయన నన్ను పిలవడు. అప్పటి దాకా నేనే ప్రధానిని." అన్నారు. తనకే పుట్టలేదంటే అమ్మ హీరాబెన్ ఆత్మ ఎంత బాధపడిందో! 2047 నాటి వరకు భారత్ వికసించకపోతే మోడీయే ప్రధానిగా కొనసాగుతారా?

జీవిత, పాలన కాలాలను వేలవేల ఏళ్ళుగా పురాణాల్లో కవులు అతిశయించారు. పురాణ రచనా కాలంలో మనిషి ఆయుష్షు తక్కువ. 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చినపుడు భారతీయుని సగటు జీవితకాలం 32 ఏళ్ళు. ఇప్పుడు 70. ఐక్యరాజ్యసమితి లెక్కల్లో ప్రపంచ మనిషి సగటు ఆయుష్షు 73 ఏళ్ళు. అభివృద్ధి చెందిన విజ్ఞాన, వైద్య శాస్త్రాలు, ఆధునిక యాంత్రిక పరిశోధక, పరీక్ష, చికిత్స సాధనాలు, పద్ధతులు మనిషి ఆయుష్షును పెంచాయి. వందేళ్ళ వరకు దేశాన్ని ఏలుతాననడం మోడీ ఎన్నికల ప్రచార అతిశయోక్తి. దేవుడు పంపాడన్న పిచ్చి మాటకు ఆధ్యాత్మికులు కూడా ఆశ్చర్యపోతున్నారు.

పురుషాహంకార, ఆధిపత్య వర్ణ, పురాణకర్తల ప్రవచనాల ప్రకారం...పౌరాణిక కల్పనలను, దేవుడిని, దేవదూతలను ప్రశ్నించరాదు, సమస్యలను పరిష్కరించమని అడగరాదు. ఆ నాటి ఆచారాలైన కుంతీ సంతానం, ద్రౌపది దాంపత్యాలను ప్రశ్నించకుండా వరాలని సర్దుకున్నాం. నేటి మోడీ దేవదూత సూత్రాన్ని నమ్మి ఆయన్ను ఏమీ అడగరాదు. రైతులతో సహా ప్రజలకు మోడీ బాధ్యుడు కాడు. దేవునికే జవాబుదారు. ఏమి, ఎలా, ఎవరికి ఇవ్వాలో, ఇవ్వరాదో దేవుడే మోడీకి చెప్తాడు. సూచనలు, మార్గదర్శకాలు ఇస్తాడు. మోడీ పార్లమెంటులో రాజదండంతో అలాగే చేస్తారు. దేవునికే సమాధానం చెప్తారు. ప్రజలకు చెప్పరు. ఆయన వారి ప్రతినిధే కాదు. మోడీని వైదిక దేవుడు పంపాడు. ముస్లింలు, క్రైస్తవులు, అవిశ్వాసులు ఆయన్ను ఏమీ అడగరాదు. దేవదూతపై వామపక్షీయులు గొడవ చేస్తారని మోడీ అన్నారు. ఈ విషయాన్ని వారు పట్టించుకోలేదు. దీంతో ప్రజా సమస్యలు పక్కదారి పట్టడం వారికి ఇష్టం లేదు.

నెహ్రూ తనను ప్రథమ సేవకునిగా ప్రకటించారు. కొంత మేరకు ఆయన అలా ప్రవర్తించారు. అనుకరణల, అసత్యాల చక్రవర్తి మోడీ నేను ప్రధాన సేవకుడినన్నారు. దేవదూత ప్రజల ప్రధాన సేవకుడైతే దేవునికే అవమానం. మోడీ తన దైవత్వ సూత్రీకరణను చాలా సార్లు చేశారు. లేని రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్మానన్నారు. బాల్యంలో మొసలితో పోరాడానన్నారు. 2013 కేదార్‌నాథ్ వరదల్లో భక్తులను దివ్యశక్తితో రక్షించి రాత్రికి రాత్రి తిరిగొచ్చారట. కనీసం మాతృభూమి గుజరాత్ నేటి ఘోర ప్రమాదాలను దేవదూత ఎందుకు ఆపరు? బిజెపికి ఓటేసిన వారికి తన సుకర్మల పుణ్యం (మానభంగ, నరమేధాలు పుణ్యాలా?) దక్కుతుందని ఇటీవల ప్రచారాలలో అన్నారు. దైవత్వానికి ఓటేయడానికి వైదికవాదులు మొగ్గు చూపుతారని మోడీ నమ్మకం.

మనుషులు, ఒంటరిగా సాధ్యం కాకపోతే, గుంపు కట్టి సమస్యలను పూర్తిగా పరిష్కరించుకుంటారు. పురాణాల్లో దేవుడు కొన్నిసార్లు ప్రత్యక్షంగా, కొన్నిసార్లు అవతారిగా లోక సమస్యల పరిష్కారానికి దిగాడు. ఆయన తొలిసారే సమస్యను శాశ్వతంగా తొలగించాలి. అలా కాలేదు. దేవుడు పదిసార్లు అవతారం ఎత్తాల్సి వచ్చింది. అది సాధనాలు లేని కాలం అనుకుందాం. సకల సౌకర్యాలు, అధికార, ఆర్థిక, అంగ, ఉపాంగ దైవబలాలున్న మోడీ అన్ని సమస్యలను 'హాం ఫట్' అని ఎందుకు రూపుమాపలేదు? 2047 లోగా భారత్‌ను స్వర్గతుల్యం చేయమని దేవుడు ఆయన్ను 2024లోనే తన దూతగా పంపాడా? ఇంతకు ముందు అనేక సందర్భాల్లో పలు వేషాల్లో దేశమంతా తిరిగి మౌన ముద్రలో, విశేష ధార్మిక కార్యాలతో భగవదేచ్ఛను నెరవేర్చారు. రామాలయం కట్టారు. ప్రధాన పూజారి పాత్ర పోషించారు. నేటి మోడీయం దైవ దౌత్యమా? స్వీయ రక్షణకెత్తిన పదకొండవ అవతారమా!?

ప్రజలకు రూ.15 లక్షల నల్లధనాన్ని పంచకపోవడం, పెద్ద నోట్ల ప్రవేశం, కేంద్ర ఆదాయాన్ని పెంచుకునే సెస్సులు, సర్‌చార్జీలు, రాష్ట్రాల ఆదాయాలకు గండి కొట్టే వస్తుసేవల పన్ను, రాష్ట్రాలపై కేంద్ర ఖర్చులను రుద్దడం, ఉపాధి లేమి, ఆకలి, పేదరికం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు, సంపన్నుల అభివృద్ధి, సామాన్యుల ఇబ్బందులు, నల్ల చట్టాలు, ప్రజాస్వామ్య రాజ్యాంగాల ఉల్లంఘనలు, దేశ మతపర చీలిక దైవాజ్ఞలేనా? "చేయవలసినవి చేయకపోయినా, చేయగూడనివి చేసినా దేవదూతను, తమ ప్రతినిధి కాని పవిత్ర ప్రవక్తను, దేవ కుమారుడిని ప్రజలు ప్రశ్నించరాదు. కోపగించరాదు. దైవాజ్ఞగా భావించి, భరించి, సహించి, ఓటేసి పరమాత్మ ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలి. నేను పరమాత్మకే జవాబుదారుడిని. ప్రజలకు కాదు. ప్రశ్న గిశ్న పరమాత్మ విధి." అని ఈ 'నవ' భారత నిర్మాత, మతోన్మాద నాజీ ఫాసిజాల సృష్టికర్త, అవతారి అభిప్రాయం. రాజయోగులను అణగదొక్కే ఉపాయం. మోడీ భగవదీకరణతో మోడీ భక్తులు దాసులవుతారు. పరమాత్మ ప్రతినిధిని ఓడిస్తే దేవునికి అపచారం చేసినట్లేనని ప్రచారం చేస్తారు. ప్రత్యామ్నాయం అవుదామనుకున్న గడ్కరీ గిరికీలు కొట్టాల్సిందే. రెండో హిట్లర్ అమిత్ షా ఆమోదించాల్సిందే. మూడో హిట్లర్ యోగి నోరు మూసుకోవాల్సిందే.

ఇలాంటి అపఖ్యాతి ఉదంతం చరిత్రలో హిట్లర్ కాలంలో కనిపిస్తుంది. హిట్లర్ పార్టీ విధేయులతో, మిత్ర మాధ్యమాలతో, ప్రచురణకర్తలతో తన బాల్య అసత్య "దివ్యత్వ" ధైర్య సాహస కథనాలను స్తుతిగీతాలుగా మోస ప్రచారం చేయించుకున్నాడు. జర్మనీ రక్షకుడని పొగిడించుకున్నాడు. విక్టర్ వాన్ కోర్బర్ పేరుతో తానే రాసుకున్న జీవిత చరిత్రలో తాను క్రీస్తునని రాసుకున్నాడు. హిట్లర్ ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చి జర్మనీని నాశనం చేశాడు. నేడు భారత్ వంతు.

/ వ్యాసకర్త 'ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం' జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545 - నాగపూర్ నుండి /

జనవాక్యం

నకిలీల ముప్పు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రుతుపవనాలు అనుకూలించడంతో రైతన్నలు గంపెడాశలతో ఉన్నారు. అయితే నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నారుమళ్లకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ మరింత ఆందోళన చెందుతున్నారు. నకిలీలను అరికట్టడంలో ప్రభుత్వాధికారులు మీన మేషాలు లెక్కించడం బాధాకరం. రైతు భరోసా కేంద్రాలు ఉత్సవ విగ్రహాలను తలపిస్తున్నాయి. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని నకిలీల బెడద నుండి రైతన్నలను ఆదుకోవాలి.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

నాట్కో ఫార్మా లాభాల్లో 40% వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 40.1 శాతం వృద్ధితో రూ.386 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.275 కోట్ల లాభాలు ఆర్జించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న నాట్కో ఫార్మా గడిచిన క్యూ4లో రెవెన్యూ 19 శాతం పెరిగి రూ.1,068 కోట్లుగా నమోదయ్యింది. కాగా.. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 46.8 శాతం వృద్ధితో రూ.4,126.9 కోట్లుగా.. నికర లాభాలు 94 శాతం పెరిగి రూ.1,388 కోట్లుగా చోటు చేసుకుంది.

త్రైపాక్షిక సహకారం కీలకం

- ప్రాంతీయ సుస్థిరత, అభివృద్ధి లక్ష్యం
- త్రైపాక్షిక సమావేశంలో చైనా ప్రధాని పిలుపు



సోమవారం సియోల్లో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్తో చైనా ప్రధాని లీ కియాంగ్ కరచాలనం చేస్తున్న దృశ్యం

సియోల్ : ప్రాంతీయ సంక్షేమం, సౌభాగ్యాలకు, సుస్థిరతకు దోహదపడేలా చైనా-జపాన్-దక్షిణ కొరియా దేశాల మధ్య సహకారాన్ని పునరుద్ధరించుకోవాలని చైనా ప్రధాని లీ కియాంగ్ పిలుపునిచ్చారు. సియోల్లో మూడు దేశాల అగ్ర నేతల 9వ త్రైపాక్షిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన స్ఫూర్తికి కట్టుబడి, ఆ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక మార్పిడుల రంగాల్లో త్రైపాక్షిక సహకారాన్ని పునరుద్ధరించాలని సమావేశం తీర్మానించింది. ఈ రంగాల్లో మూడు దేశాలు ఉమ్మడి ప్రయోజనాలను కలిగి వున్నాయి. చారిత్రక, సార్వభౌమాధికార అంశాలతో సహ క్లిష్టమైన ఇంతర అంశాలపై నెలకొన్న విభేదాలను, అలాగే సైద్ధాంతిక అభిప్రాయ బేధాలను పక్కనబెట్టి ఐక్యంగా కృషి చేయాలని భావిస్తున్నాయి.

మూడు దేశాలు సమాన భాగస్వాములుగా పరస్పరం భావిస్తూ, గౌరవించుకోవాల్సి వుందని లీ పేర్కొన్నారు. అభివృద్ధి కోసం పాటు పడుతూ ఆర్థిక సార్వజనీనకరణను, స్వేచ్ఛా వాణిజ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

సుస్థిర అభివృద్ధి, ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, విపత్తునిర్వహణ వంటి రంగాల్లో కూడా సహకారాన్ని పెంపొందించుకోవాలని మూడు దేశాలు భావిస్తున్నాయి. క్రమం తప్పకుండా త్రైపాక్షిక సమావేశాలను, మంత్రిత్వ స్థాయి సమావేశాలను నిర్వహించడం ద్వారా త్రైపాక్షిక సహకారాన్ని వ్యవస్థీకృతం చేయడానికి నేతలు అంగీకరించారు. ఈ సమావేశం అనంతరం ముగ్గురు నేతలు కొరియా వాణిజ్య, పారిశ్రామిక మండలిలో జరిగిన వ్యాపార సదస్సుకు హాజరయ్యారు.

ద్వైపాక్షిక సంబంధాలపై చైనా, దక్షిణ కొరియా చర్చలు

ఇరు దేశాల మధ్య స్నేహ బంధాన్ని, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకుంటూ, పరస్పర ప్రయోజనాలు, ఆందోళనలపై గౌరవించుకోవాలని చైనా ప్రధాని లీ కియాంగ్ కోరారు. చైనా-దక్షిణ కొరియా సంబంధాలు సుస్థిరమైన అభివృద్ధి దిశగా సాగాలని ఆకాంక్షించారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్తో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. 30ఏళ్ల క్రితం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు నెలకొన్నాయి. కాలంతోపాటు సంబంధాలు కూడా బలపడుతూ ముందుకు సాగాయని లీ పేర్కొన్నారు. ఆర్థిక వాణిజ్య సహకార రంగాల్లో సాధించిన ప్రగతి ఇరు దేశాల ప్రజలకు ఉపయోగపడిందని అన్నారు. పరస్పర గౌరవం, పారదర్శకత, కలుపుకుని పోవడం, పరస్పర ప్రయోజనాలు వంటి విలువలు, ఆదర్శాలకు రెండు దేశాలు కట్టుబడి వున్నాయని చెప్పారు.

నెహ్రూకు ఘన నివాళి

న్యూఢిల్లీ : భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయనకు దేశవ్యాప్తంగా ఘనంగా నివాళి అర్పించారు. దేశరాజధాని శాంతివన్ వద్ద ఆయనకు కాంగ్రెస్ నాయకులు అంజలి ఘటించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ఎంపి అజయ్ మేకన్ ఇతర నాయకులు నెహ్రూకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా సోషల్ మీడియాలో నెహ్రూకు నివాళి తెలిపారు. దేశ తొలి ప్రధానిగా 1947లో బాధ్యతలు స్వీకరించిన నెహ్రూ 1964 వరకూ ఆ పదవిలో ఉన్నారు.

సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి

- జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక రంగం అభివృద్ధి చెందడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భావించారని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సంద ర్భంగా సోమవారం జెఎన్‌టియులోని పరిపాలన భవనంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌తో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా అందరూ ప్రయత్నం చేయాల ని తెలిపారు. ముఖ్యంగా పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. కాగా మొట్టమొదటి ప్రధాన మంత్రిగా నెహ్రూ దేశానికి సేవలు మరువలేని వన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, భానుమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, సుజాత, పద్మ సువర్ణ, దుర్గాప్రసాద్, వి.బి.చిత్ర, శోభాబిందు, సురేష్‌బాబు, వైస్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకాంతి, వర్సిటీ పిఆర్ఓ ఎం.రామశేఖరరెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, బోధన, బోధనేతర, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసికి రూ.13,782 కోట్ల లాభాలు

- ప్రతీ షేర్‌పై రూ.6 డివిడెండ్

ముంబయి : దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.5 శాతం వృద్ధితో రూ.13,782 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.13,191 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా చివర డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.6 చెల్లించడానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా.. బీమా రంగంలో 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉన్నట్లు వెల్లడించింది. 2024 మార్చితో ముగిసిన ఏడాదిలో సంస్థ మొత్తం ప్రీమియం రూ.4,75,070 కోట్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం 2023 మార్చి ముగింపు నాటికి ఇది రూ.4,74,005 కోట్లుగా ఉంది. గడిచిన ఏడాదిలో వ్యక్తిగత వ్యాపార ప్రీమియం ఆదాయం రూ.3,03,768 కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాదిలో ఇది రూ.2,92,763 కోట్లుగా ఉంది. 2024 మార్చి ముగింపు నాటికి ఎల్ఐసి అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.51,21,887 కోట్లకు చేరింది. ఇది 2023 మార్చి ముగింపు నాటికి రూ.43,97,205 కోట్లుగా నమోదయ్యింది.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎఫ్55 5జి

- ధర రూ.24,999

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా పవర్‌ఫుల్ స్నాప్‌డ్రాగన్ 7జెనరేషన్ ప్రాసెసర్‌తో గెలాక్సీ ఎఫ్55 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. సోమవారం న్యూఢిల్లీలో దీనిని ఆ కంపెనీ సీనియర్ అధికారులు సూన్ చొయి, రాజు పుల్లన్, ఆదిత్య బబ్బర్ ఆవిష్కరించారు. దీని ప్రారంభ ధరను రూ.24,999గా నిర్ణయించింది. వెనుక వైపు 50 ఎంపి ఒఐఎస్ కెమెరా, 45 వాట్ సూపర్‌ఫాస్ట్ చార్జింగ్, సూపర్ అమోలెడ్ ప్లస్ 120హెచ్‌జడ్ డిస్‌ప్లే ఫీచర్లు కలిగి ఉంది.

వినోద, రిటైల్ రంగాల్లోకి అపర్ణ కన్‌స్ట్రక్షన్స్

హైదరాబాద్ : అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ తమ వ్యాపార విభాగాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. కొత్తగా రిటైల్, వినోద రంగాలలో ప్రవేశం కోసం రూ.284 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించింది. రిటైల్ రంగంలో విస్తరణ కోసం రూ.252 కోట్లు పెట్టుబడితో తమ మొదటి మాల్ అపర్ణ నియోను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. వినోద విభాగంలోకి ప్రవేశించడానికి రూ.32 కోట్ల వ్యయంతో అపర్ణ సినిమాస్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో ఉన్న అపర్ణ నియో 3.67 ఎకరాలలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉందని ఆ సంస్థ ఎండి రాకేష్ రెడ్డి తెలిపారు. 1990 నుండి అపర్ణ గ్రూప్ వివిధ రకాల వ్యాపార విభాగాలలో ప్రవేశిస్తుండటం ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను స్థిరంగా విస్తరిస్తుందన్నారు. అపర్ణ నియో మాల్‌ను మే 31న సందర్శకుల కోసం తెరువనున్నామన్నారు.

APARNA
Lead the future

వంద పైగా పంటలకు బీమా

- క్షేమ నుంచి సుకృతి ప్లాన్

న్యూఢిల్లీ: తమ సుకృతి ప్లాన్‌తో 100 పైగా పంటలకు బీమా పొందవచ్చని క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఈ ప్లాన్ 20 పైగా రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తమ యాప్‌లో ఎకరాకు రూ.499 నుంచే పంట బీమా పాలసీని కొనుగోలు చేయవచ్చని ఆ సంస్థ చీఫ్ అండర్ రైటింగ్ ఆఫీసర్ సివి కుమార్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో తొలి విడతలో భాగంగా 23.2 లక్షల ఎకరాల సాగు భూమిని కలిగి ఉన్న 9.40 లక్షల మంది రైతులకు సుకృతి అందుబాటులో ఉంటుందన్నారు.

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
Trust-Growth
H.O : విశాఖపట్నం, R.O : విజయవాడ, మంగళగిరి బ్రాంచ్, గుంటూరు జిల్లా. ఫోన్: 08645-233222

స్వాధీనత ప్రకటన [Rule 8(1)] (స్థిరాస్తి కొరకు) APPENDIX IV

తాకట్టుపెట్టిన ఆస్తి వివరాలు: గుంటూరు జిల్లా, పెదకాకాని రిజిస్ట్రేషన్ ఉప జిల్లా, కొప్పురవూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొప్పురవూరు గ్రామం డి.నెం: 26, ఎక 3-18 సెంట్లు, డి.నెం.27, ఎక 2-55 సెంట్లు, డి.నెం.28/1, ఎక 0-66.1/2 సెంట్లు, డి.నెం.30/1, ఎక 4-90 సెంట్లు, మొత్తం నాలుగు నెంబర్లలో ఒక విస్తీర్ణంలో ఉన్న ఎక 11-29.1/2 సెంట్లు భూమి మరియు డి.నెం.26, ఎక1-06 సెంట్లతో మొత్తం ఎక 12-35.1/2 సెంట్లు, వి.జి.టి.ఎం.యుడిఏ ఫైల్ నెం.ఇ2/120/2014, తేది.19/2014, ఎల్‌పి.నెం.19/2014/జిఎన్‌టి ప్రకారం 220 చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.65, 220 చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.66, 220 చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.67, 220 చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.68, 220 చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.69, 210.83చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.70, 253.33చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.71, 240చ.అ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.72, 240చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.73, 240చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.74, 240చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.75 మరియు 240చ.గ.ల విస్తీర్ణపు ఫ్లాట్ నెం.76తో పూర్తి విస్తీర్ణం 2764.16చ.గ.ల సైట్ దీనిలో నిర్మిస్తున్న "క్యాపిటల్ స్క్వేర్"; బి-బ్లాక్. సరిహద్దులు: తూర్పు: 40 అ.ల వెడల్పు రోడ్డు :218-0", దక్షిణం:శ్యామల కిషోర్ రెడ్డికు చెందిన సైటు: 115.0", పడమర: 40అ.ల వెడల్పు రోడ్డు-214.6, ఉత్తరం: ప్లాట్ నెం.లు 64, 67కు చెందిన సైటు-115.0. ఈ సరిహద్దుల పరిధిలో 2764.16 చ.గజాలు లేదా 2311.11 చ.మీటర్ల స్థలం మరియు దాని వసతులు మరియు ఉపకరణాలు మొదలైన వాటితో పాటుగా 46చ.గ.లు లేదా 38.46చ.మీ.ల విస్తీర్ణంలో విభజించబడని మరియు పేర్కొనబడని వాటా, మొత్తం విస్తీర్ణంలో 2764.16 చ.గజాలు లేదా 2311.11 చ.మీ.ల, అసంపూర్తి టు బెడ్ రూమ్ ఫ్లాట్ నెం.307తో పాటుగా సైట్, మొత్తం 1250చ.గ.ల విస్తీర్ణంతో క్యాపిటల్ స్క్వేర్ "బి- బ్లాక్" యొక్క రెండవ అంతస్తులో ఉంది (ప్లింత్ & ఉమ్మడి ఏరియాలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోని, ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా) నిర్మించబడింది-సైట్ యొక్క పేర్కొన్న వాటా సరిహద్దులుగా: తూర్పు: ఉమ్మడి కారిడార్.దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై & ఉమ్మడి మెట్లు. ఈ సరిహద్దులలో అసంపూర్తి ఫ్లాట్ నెం 307, రెండవ అంతస్తులో అనగా పై పేర్కొన్న "క్యాపిటల్ స్క్వేర్" "బి-బ్లాక్" అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ యొక్క స్టిల్ట్, గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుల పైన, అన్ని ఉమడి ఉమ్మడి హక్కులతో సహా స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా వసతులు, అనుబంధాలు మొదలైన వాటి హక్కులతోకలిపి.

క్ర. సం	రుణ ఖాతా నెంబరు	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల పేరు	ట్రస్టు పేరు	బ్యాంకు & బ్రాంచి పేరు, ఖాతా నెంబరు & ఐఎఫ్ఎస్‌సి కోడ్	27.05.2024 నాటికి పూర్తి బకాయి మొత్తాలు రూ.లలో	రిజర్వు ధర (రూ.లలో)	ధరావత్తు (ఇఎండి) (రూ.లలో)	వేలం తేది & సమయం	స్వాధీనతా విధానం
2.	7986361/ HDBFSL	1) మెసర్స్ సీతా మహాలక్ష్మి హ్యాండ్లూమ్స్ ("రుణగ్రహీత") యజమాని శ్రీ.శివశంకర పొట్లబతుని 2) శ్రీమతి సీతామహాలక్ష్మి పొట్లబతుని ("సహ-రుణగ్రహీత")3) మెసర్స్ సాయి లక్ష్మి హ్యాండ్లూమ్స్ ("సహ-రుణగ్రహీత") 4) శ్రీ.శివశంకర పొట్లబతుని ("సహ-రుణగ్రహీత") 5) శ్రీ పొట్లబతుని ప్రకాష్ ("సహ-రుణగ్రహీత")	ఇఏఆర్‌సి ట్రస్టు ఎస్‌సి 449	ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ నారిమన్ పాయింట్ 000405131107I CIC0000004	Rs. 82,12,174.17	Rs. 40,00,000	Rs. 4,00,000	13.06.2024 at 3:00 pm	భౌతికంగా

తాకట్టుపెట్టిన ఆస్తి వివరాలు: గుంటూరు జిల్లా, మంగళగిరి ఉప జిల్లా, మంగళగిరి మునిసిపాలిటీ పరిధిలో, పాత మంగళగిరి, 11వ వార్డు, డోర్ నెం.11-285/13/ఏ, అసెస్‌మెంట్ నెం.1023016888, సర్వే నెం.130/ఏ1, సర్వే నెం.119పరిధిలో 145.2 చ.గ.ల సైటు మరియు ఆర్‌సిసి బిల్డింగ్ మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** రైస్ మిల్లు యజమానుల ఆస్తి, **దక్షిణం:** కవిత ఆస్తి, **ఉత్తరం:** పాంచాల శివ మోహన్ రావు ఆస్తి, **పడమర:** జాయింట్ బజార్, ఈ సరిహద్దుల పరిధిలో 145.2 చ.గ.లు లేదా 121.986 చ.మీ.ల ఆర్‌సిసి బిల్డింగ్‌లోని సైటు మరియు విద్యుత్ కన్స్యూమర్ కనెక్షన్ మొదలైనవి. గుంటూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు మంగళగిరి సబ్-రిజిస్ట్రేషన్ పరిధిలోఉన్నాయి.

వేలం ప్రక్రియకు సంబంధించి ముఖ్యమైన సమాచారం:

1	ముంబయి వద్ద చెల్లుబాటగునట్లు పై పేర్కొన్న ట్రస్ట్ పేరున అన్ని డిమాండ్ డ్రాఫ్టులు (డిడి) తీయవలెను.	
2	ధరావత్తు దాఖలు చేయుటకు చివరి తేది	వేలం తేదికి 1 రోజు ముందు అందవలెను
3	బిడ్స్ దాఖలుచేయు ప్రదేశం	ఇడెల్‌వీస్ హౌస్, ముంబయి వద్ద
4	వేలం ప్రదేశం (వేలం కొరకు వెబ్‌సైట్)	ఇ-వేలం (https://auction.edelweissarc.in)
5	టోల్ ఫ్రీ నెంబరు	18002666540
6	ఆస్తి తనఖీచేయు తేది& సమయం	ముందస్తు అనుమతి ప్రకారం

అమ్మకపు వివరణాత్మక నియమ& నిబంధనల కొరకు, దయచేసి ఇఏఆర్‌సి వెబ్‌సైట్ అనగా., https://auction.edelweissarc.in లో ఇవ్వబడిన లింకును చూడండి.

ప్రదేశం: ముంబయి సం/- అధీకృత అధికారి
తేది: 27-05-2024 ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరపున
Edelweiss Asset Reconstruction

మరో 7 రోజులు బెయిల్ పొడిగించండి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ తన మధ్యంతర బెయిల్‌ను ఏడు రోజులు పొడిగించాలని పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నానని అందుకే పొడిగించాలని అన్నారు. తనను అరెస్టు చేసిన తరువాత బరువు ఏడు కిలోలు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. అందుకే తాను పిఇటి-సిటి స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో టెస్టులు చేయించుకోవడానికి మరో ఏడు రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టును కోరారు.

అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. సుప్రీంకోర్టు జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఇడి అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. దాదాపు 51 రోజుల తరువాత కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు ఆయనకు 21 రోజులు మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. ఢిల్లీ ప్రభుత్వం 2021-22కు సంబంధించిన లిక్కర్ పాలసీని రూపొందించి అమలు చేయడంలో అవినీతి, మనీలాండరింగ్ జరిగిందని ఈ కేసులో ఆరోపణలున్నాయి.

మేనిఫెస్టో హామీలతో లబ్ధి చేకూరితే అది అవినీతి కాదు

- సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఒక రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల వల్ల ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు ఒనగూడితే అది అవినీతి కిందకు రాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించి పిటిషనర్ తరపు న్యాయవాది చేస్తున్న వాదనలు ఆమోదయోగ్యం కాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఒక రాజకీయ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఓటర్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆర్థిక లబ్ధిని పొందినట్లైతే సదరు పార్టీ అభ్యర్థి అవినీతికి పాల్పడినట్లే అవుతుందని పిటిషనర్ శ్రీధరన్ వాదించారు. అయితే ఆ వాదనలను ఏ మాత్రమూ అంగీకరించలేమని బెంచ్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. చామరాజ్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన శశాంక శ్రీధరన్ అనే ఓటరు వేసిన ఎన్నికల పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టిపారేసింది. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ శ్రీధరన్ సుప్రీంను ఆశ్రయించారు. దానిపై విచారించిన సుప్రీం బెంచ్ పై తీర్పునిచ్చింది.

అరెస్టు అక్రమం

- కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఢిల్లీ లిక్కర్ కేసు వ్యవహారంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దర్యాప్తు సంస్థలు అక్రమంగా అరెస్టు చేశాయని ఆమె తరపున న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో వాదనలు వినిపించారు. కేవలం అప్రూవర్లు ఇచ్చిన వాంగ్మూలంతో ఒక పార్టీ సీనియర్ నాయకురాలిగా, ఎమ్మెల్సీగా ఉన్న కవితపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టి, అదుపులోకి తీసుకున్నారన్నారు. లిక్కర్ కేసులో ఇడి, సిబిఐ కేసుల్లో బెయిల్ మంజూరు, అలాగే ట్రయల్ కోర్టు.. కవిత అరెస్ట్‌కు సిబిఐకి అనుమతి, కస్టడీ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో కవిత వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సోమవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ దాదాపు 45 నిమిషాలపాటు సుదీర్ఘ విచారణ జరిపారు.

జూన్ 28న ఇరాన్ అధ్యక్ష ఎన్నికలు

- గురువారం నుండి అభ్యర్థుల నమోదు ప్రక్రియ ప్రారంభం

టెహరాన్ : గత వారం హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించడంతో అధ్యక్ష ఎన్నికలు జూన్ 28న నిర్వహించనున్నారు. . ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడు మహ్మద్ మొఖ్బర్ సోమవారం కొత్త పార్లమెంట్‌ను ఉద్దేశించి తొలిసారిగా ప్రసంగిస్తూ అధ్యక్ష ఎన్నికలపై ప్రకటన చేశారు. మంగళవారం పార్లమెంట్ కొత్త స్పీకర్‌ను కూడా ఎన్నుకుంటుందని భావిస్తున్నారు. ఇరాన్‌పై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ దేశానికి ఆదాయం సమకూర్చే కీలక వనరైన ముడి చమురు ఉత్పత్తిలో ఇరాన్ మెరుగైన ఫలితాలను సాధించిందని మొఖ్బర్ చెప్పారు. రైసి పాలనలో దేశం పురోగతి సాధించిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వుందన్నారు. ఇవన్నీ మన మత పెద్ద ఆయతుల్లా ఖమేని మార్గనిర్దేశంలో అధ్యక్షుడు రైసీ నిజాయితీతో చేసిన కృషి వల్లనే సాధ్యమయ్యాయని మొఖ్బర్ పేర్కొన్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు చనిపోయిన 50 రోజుల్లో తిరిగి ఎన్నికలు నిర్వహించాలి. ఆ ప్రకారమే రౌసీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని జూన్ 28న ఎన్నుకుంటారు. గురువారం నుండి ఐదు రోజుల పాటు అభ్యర్థుల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొఖ్బర్ కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

గుజరాత్‌లో గోగూండాల ఘాతుకం

- ముస్లిం కార్మికుడి హత్య
- మూకదాడిగా కేసు నమోదుకు పోలీసుల నిరాకరణ

హత్యకు గురైన బలోచ్, మృతదేహం వద్ద ఆయన కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ : కష్టపడి కుటుంబాన్ని పోషించుకునే ఒక ముస్లిం కార్మికుడిపై గోగూండాలు పట్టపగలే దాడి చేసి, దారుణంగా హత్య చేశారు. సంపాదించే వ్యక్తి మరణించడంతో ఆ కుటుంబం రోడ్డునపడింది. స్థానిక సంతలో పశువులను కొనుగోలు చేసి, వాటిని తన సోదరి ఇంటికి వ్యాన్‌లో తీసుకెళ్తుండగా గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో ఈ దారుణం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 ఏళ్ల మిశ్రి ఖాన్ జుమే ఖాన్ బలోచ్ కార్మికుడిగా కష్టపడి పని చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి దృష్టిలోపం ఉన్న భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 23న బలోచ్ తన స్నేహితుడు హుస్సేన్ ఖాన్‌తో కలిసి స్థానిక పశువుల మార్కెట్ నుంచి కొన్ని పశువులను కొనుగోలు చేశాడు. వీటిలో రెండు గేదెలను తన సోదరికి ఇవ్వడానికి ఖాన్‌తో కలిసి ఒక వ్యాన్‌లో బయలుదేరాడు. ఖాన్ వ్యాన్‌ను నడుపుతున్నాడు. ఈ వ్యాన్‌ను గోగూండాలు వెంబడించారు. అంతలో, వ్యాన్ టైర్లకు పంక్చర్ పడటంతో, వీరు గోగూండాలకు పట్టుబడ్డారు. వ్యాన్ నడుపుతున్న ఖాన్ ఏదో విధంగా తప్పించుకోగా, బలోచ్‌ను గోగూండాలు విచక్షణారహితంగా కొట్టారు. దీంతో, బలోచ్ అక్కడికక్కడే మరణించాడు.

దీసా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

హుస్సేన్ ఖాన్ ఫిర్యాదు మేరకు దీసా (గ్రామీణ) పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గోగూండాలు అఖేరాజ్‌సిన్హ్ పర్బత్‌సిన్హ్ వాఘేలా, నికుల్ సిన్హ్, జగత్ సిన్హ్, ప్రవీణ్‌సిన్హ్, హమీర్‌భాయ్ ఠాకూర్‌పై హత్య, నిర్బంధం, బెదిరింపులు, కుట్ర వంటి అభియోగాలతో కేసు నమోదు చేశారు. మూకదాడి కింద కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షయ్ రాజ్ మక్వానా కూడా ఈ హత్యను 'మూకదాడి'గా పేర్కొనలేమని చెప్పారు.

ప్రణాళిక ప్రకారం దాడి : మృతుడి స్నేహితుడు

ఈ హత్య గురించి హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ బలోచ్ హత్య అనుకోకుండా జరిగిందని కాదని, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందేనని అన్నారు. గత ఏడాది జులైలో కూడా నిందితులు తమపై వేధింపులకు పాల్పడ్డారని గుర్తు చేశారు. బలోచ్ హత్యతో దృష్టిలోపం ఉన్న ఆయన భార్య, నలుగురు పిల్లలు అనాథగా మారారని బంధువులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యతో బనస్కాంత జిల్లాలో ముస్లింలు భయాందోళనకు గురవుతున్నారు. పశువుల వ్యాపారం, పశువుల రవాణా చేసే వారిపై గోగూండాలు నిత్యం బహిరంగంగానే దాడులకు పాల్పడుతున్నారు. వారి నుంచి భారీగా డబ్బులు గుంజుతున్నారు. జిల్లాలోని సేసన్‌నావా గ్రామంలో పశువుల వ్యాపారిపై గతేడాది దారుణంగా దాడి చేశారు. 2002 గోద్రా అల్లర్ల సమయంలోనూ... ఇదే గ్రామంలో మహిళలతో సహా 14 మంది ముస్లింలను దారుణంగా హత్య చేశారు. ఈ అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 70 మందిని స్థానిక కోర్టు 2014లో నిర్దోషులుగా ప్రకటించింది.

31న విచారణకు హాజరవుతా

- ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు : అనేకమంది మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడిఎస్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ ఈ నెల 31న సిట్ ముందు విచారణకు హాజరవుతానని సోమవారం ప్రకటించారు. దేశం నుంచి పారిపోయిన నెల రోజుల తరువాత ప్రజ్వల్ నుంచి తొలిసారిగా ఈ ప్రకటన వచ్చింది. కన్నడ టివి ఛానెల్ అసియానెట్ సువర్ణ న్యూస్‌లో ప్రసారమైన ఒక వీడియా సందేశం ద్వారా ప్రజ్వల్ రేవణ్ణ ఈ విషయాన్ని పేర్కొన్నారు. 'మే 31, శుక్రవారం ఉదయం 10 గంటలకు సిట్ ముందు విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతాను. విచారణకు సహకరిస్తాను. నాపై అభియోగాలపై స్పందిస్తాను. నాకు కోర్టులపై పూర్తి విశ్వాసం ఉంది. ఈ తప్పుడు కేసుల నుంచి కోర్టుల ద్వారా బయటికి వస్తానని నమ్ముతున్నాను' అని ప్రజ్వల్ ఈ వీడియో సందేశంలో తెలిపారు. 'దేవుడు, ప్రజలు, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం నాపై ఉండనివ్వండి. ఈ నెల 31న విచారణకు తప్పకుండా వస్తాను. తరువాత వీటిన్నింటికీ ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తాను. నాపై నమ్మకం ఉంచండి' అని కూడా అన్నారు. తల్లిదండ్రులు, తాత దేవగౌడ, చిన్నాన్న కుమారస్వామి, రాష్ట్ర ప్రజలు, పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెప్పారు. 'నేను ఎక్కడ ఉన్నానో వెల్లడించలేదు. కాబట్టి, సమాచారాన్ని పంచుకోవడానికి ఇలా మీ ముందుకు వచ్చాను' అని అన్నారు. లైంగిక వేధింపుల వీడియోలు బయటకు రావడంతో, హసన్ ఎన్నికలు జరిగిన ఒక రోజు తరువాత అంటే ఏప్రిల్ 27న ప్రజ్వల్ రేవణ్ణ దేశం విడిచి జర్మనీకి పారిపోయారు. సిబిఐ అభ్యర్థనతో ఇంటర్‌పోల్ కూడా ప్రజ్వల్ రేవణ్ణపై బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసింది. అతని దౌత్య పాస్‌పోర్టు రద్దు చేస్తామని కేంద్ర విదేశాంగ శాఖ నోటీసులు జారీ చేసింది.

ఆ యాడ్స్‌ను బిజెపి ఆపాల్సిందే

- కలకత్తా హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : తృణమూల్‌కు వ్యతిరేకంగా ప్రచురిస్తున్న అవమానకరమైన యాడ్‌లను ఆపాలంటూ బిజెపిని కలకత్తా హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆ ఆదేశాలకు వ్యతిరేకంగా బిజెపి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ ఆదేశాల విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్‌కు సంబంధించి అవమానకరంగా రూపొందించిన వాణిజ్య ప్రకటనలు ప్రచురించకుండా నిలువరించాలని బిజెపిని ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఆ యాడ్స్ ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘిస్తున్నాయని, అప్రతిష్టపాల్జేసేలా వున్నాయని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ కె.వి.విశ్వనాథ్‌లతో కూడిన సుప్రీం వెకేషన్ బెంచ్ పేర్కొంది. 'మేం వాణిజ్య ప్రకటనలు చూశాం నిజానికి ఆ యాడ్‌లు చాలా అవమానకరంగా వున్నాయి. మీరు మంచివారని మీరు చెప్పుకోవచ్చు, కానీ ఈ దారుణాన్ని పెంపొందించేందుకు మేం సాయం చేయాలనుకోవడం లేదు." అని జస్టిస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. వాస్తవాల ఆధారంగా ఆ వాణిజ్య ప్రకటనలు రూపొందాయంటూ బిజెపి తరపున సీనియర్ న్యాయవాది పి.ఎస్.పట్వాలియా చేసిన వాదనలను కొట్టిపారేశారు. 'ఇవేమీ ఓటర్లకు ఉపయోగపడేది కావు, దిగజార్చేవి." అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. "ఇంక ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావించకండి, దీంట్లో మేం జోక్యం చేసుకోవాలనుకోవడం లేదు." అని జస్టిస్ మహేశ్వరి స్పష్టం చేశారు.

రఫాలో సహాయక శిబిరాలపై దాడులు

- పిల్లలు, మహిళలతోసహా 45 మంది సజీవ దహనం
- ఇజ్రాయిల్ ఘాతుకాన్ని ఖండించిన అంతర్జాతీయ సమాజం

దేర్ అల్ బలాహ్, గాజా : గత ఏడు మాసాలుగా మానవాళిపై మహా నేరాలకు పాల్పడుతున్న యూదు దురహంకారి, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు తాజాగా మరో దారుణానికి ఒడిగట్టాడు. రఫా నగరానికి వాయవ్యంగా ఉన్న తాల్ అస్ సుల్తాన్ ప్రాంతంలో నిర్వాసిత శిబిరాలపై అత్యంత కిరాతకంగా బాంబులేసి పిల్లలు, మహిళలతో సహా 45 మంది అమాయక పౌరులను పొట్టనపెట్టుకున్నాడు. ఈ బాంబు దాడుల్లో నిర్వాసితుల శిబిరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి..అందులో తలదాచుకున్న పాలస్తీనీయుల మృతదేహాలు గుర్తు పట్టడానికి కూడా వీల్లేని విధంగా మాడి మసైపోయాయని స్థానికులు ఆవేదనతో తెలిపారు. ఇజ్రాయిల్ దాష్టీకాన్ని కతార్, ఈజిప్ట్, టర్కీ, స్పెయిన్, ఐర్లండ్, నార్వే, జర్మనీ, యూరోపియన్ యూనియన్, అమెరికా సహా పలు దేశాలు, అంతర్జాతీయ సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఆ శిబిరాల్లో హమాస్ తీవ్రవాదులు దాక్కున్నారని ఇజ్రాయిల్ ఎప్పటిలానే దుష్ప్రచారం చేస్తోంది.

ఉద్దేశపూర్వకంగానే దాడులు

ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే ఈ దాడులకు పాల్పడిందని పాలస్తీనా అధ్యక్ష కార్యాలయం సోమవారం విమర్శించింది. ఇది సురక్షితమైన జోన్‌గా ప్రకటించినప్పటికీ దాన్ని పట్టించుకోకుండా దాడులు జరిపిందని పాలస్తీనా అధికారులు తెలిపారు. అంతర్జాతీయ తీర్మానాలను, నిబంధనలకు ఇజ్రాయిల్ తుంగలో తొక్కుతూ అమాయకులను ఊచకోత కోస్తోందని పాలస్తీనా అధ్యక్ష కార్యాలయం విమర్శించింది. రఫాపై మిలటరీ దాడులు ఆపాలంటూ ఐసిజె గత వారం ఆదేశించిన తరువాత కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని భూమండలంపై నరకంగా ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు , ఆర్థిక సాయం అందిస్తూ అతి పెద్ద మద్దతు దారుగా ఉన్న అమెరికాకు కూడా ఈ నేరంలో భాగం ఉందని హమాస్ సీనియర్ అధికారి సామి అబూ జురి పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడులు ఎంతమాత్రమూ సమర్థనీయం కాదని ఇటలీ రక్షణ మంత్రి గైడో క్రాసెటో అన్నారు. గాజా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో యావత్ ప్రపంచం విఫలమైందని కెనడా నేత జగ్‌మీత్ సింగ్ విమర్శించారు. శాంతిని సాధించాలంటే బలమైన పాలస్తీనా అథారిటీ మనకు అవసరం, అంతేకానీ బలహీనమైనది కాదని ఇయు విదేశాంగ విధాన చీఫ్ జోసెఫ్ బోరెల్ వ్యాఖ్యానించారు. బ్రసెల్స్‌లో పాలస్తీనా ప్రధాని మహ్మద్ ముస్తఫాతో ఆయన భేటీ అయ్యారు. గాజా ప్రజలకు మద్దతునివ్వడమే తొలి ప్రాధాన్యత అని ముస్తఫా చెప్పారు.

దాడులు ఆగవు : నెతన్యాహు హూంకరింపు

రఫాతో సహా గాజాపై దాడులను ఆపేది లేదని ఫాసిస్టు నేత నెతన్యాహు హూంకరించారు. ఆదివారం వార్ కేబినెట్ సమావేశానికి ముందుగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఐసిజె ఆదేశం పట్ల పలు దేశాల హర్షం

గాజాసిటీ:: రఫాపై మిలిటరీ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ఆదేశించడాన్ని పాలస్తీనియన్లతో సహా ప్రపంచ శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరూ స్వాగతించారు. కాల్పుల విరమన పై ఐసిజె తన ఆదేశంలో పేర్కొన్ని ఉండాల్సిందని మరి కొందరు అభిప్రాయపడ్డారు. ఐసిజె ఆదేశాన్ని కచ్చితంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజం పై ముఖ్యంగా ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారుగా ఉన్న అమెరికాపై ఉందని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయ స్థానం ఆదేశం ఇచ్చిన తరువాత కూడా ఇజ్రాయిల్ పేట్రేగిపోతోందని, ఇది ఐసిజె నిర్ణయాన్ని ఉల్లంఘించడమేనని వారు చెప్పారు. పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడుతోందంటూ వివిధ అంతర్జాతీయ సంస్థలు ఇస్తున్న నివేదికలపై ఐరాస నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తు జరిపి నెల రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని కూడా ఐసిజె తన రూలింగ్‌లో పేర్కొంది. ఈ ఆదేశాన్ని పాలస్తీనా అధ్యక్ష కార్యాలయం స్వాగతించింది. ఈ ఆదేశాన్ని ఇజ్రాయిల్ గౌరవించేలా చూడాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉందని పేర్కొంది. గల్ఫ్ కో-ఆపరేటివ్ కౌన్సిల్ దీనిని స్వాగతిస్తూ, అంతర్జాతీయ చట్టాల పట్ల, అలాగే పాలస్తీనీయుల హక్కుల పరిరక్షణపట్ల అంతర్జాతీయ సమాజ నిబద్ధతకు ఇది దర్పణం పడుతుందని చెప్పింది. ఐసిజె ఆదేశాన్ని తాము స్వాగతిస్తున్నామని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా చెప్పారు. గాజాలోకి ఆహారం, మందులు, వైద్య పరికరాలు రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఐసిజె ఈ దశలో ఇచ్చిన ఆదేశం చాలా ముఖ్యమైనది, కీలకమైనది అని జెనిన్‌లోని అరబ్ అమెరికన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ సంబంధాల నిపుణుడు ప్రొఫెసర్ అయెమన్ తలాల్ యూసఫ్ అన్నారు. ఇది మంచి నిర్ణయమే. అయితే, ఇది మాత్రమే చాలదు అని పాలస్తీనా యూనివర్సిటీలో అంతర్జాతీయ చట్టాలను బోధించే అధ్యాపకుడు అబ్దుల్ ఫతా అసఖూల్ అన్నారు.

టెల్ అవీవ్‌పై రాకెట్ల దాడి చేశాం:
హమాస్‌కు చెందిన సాయుధ విభాగం ఖసమ్ బ్రిగేడ్స్ వెల్లడి

ఆదివారం సెంట్రల్ ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్‌పై తాము రాకెట్లతో దాడి చేశామని హమాస్‌కు చెందిన సాయుధ విభాగం ఖసమ్ బ్రిగేడ్స్ ప్రకటించింది. ఇజ్రాయిల్‌పై ఈ విధమైన దాడి చేయడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి. గాజాలో అమాయకపౌరులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ దాష్టీకానికి సమాధానమే ఈ దాడి అని ఖసమ్ బ్రిగేడ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. టెల్ అవీవ్‌లోను, ఇతర పట్టణాల్లోను ఆదివారం పెద్దయెత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా తెలిపింది. హెర్జిలియా సిటీలో రాకెట్ దాడిలో ఒక కారు ధ్వంసమైంది. ప్రాణ నష్టమేమీ సంభవించలేదు. రఫా నుంచి ఏడెనిమిది రాకెట్ దాడులు జరిగాయని, అయితే వాటిలో చాలా వరకు తిప్పికొట్టామని ఇజ్రాయిల రక్షణ బలగాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

మృతులు 2వేల పైనే!

- ఐరాసకు పపువా న్యూగినియా అధికారుల నివేదిక

పోర్ట్ మోర్స్బై : పపువా న్యూగినియాలో భారీగా కొండచరియలు విరిగిపడిన ఘటనలో చనిపోయినవారు 2వేలకు పైనే ఉంటారని ఆ దేశ అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడడంతో మారుమూల గ్రామం మొత్తం నేలమట్టమై పోయిందని చెప్పారు. దేశ రాజధాని పోర్ట్ మోర్స్బైలోని ఐక్యరాజ్య సమితి ప్రాంతీయ కార్యాలయానికి ఈ మేరకు జాతీయ విపత్తుల నిర్వహణా కేంద్రం సమాచారం అందించింది. అంచనాలకు అందనంత విధ్వంసం చోటు చేసుకుందన్నారు. ఎంగా ప్రావిన్స్‌లో పర్వత సానువుల్లో గల మారుమూల కుగ్రామం దాదాపు కనుమరుగైందని అధికారులు తెలిపారు. ముంగలో పర్వతం నుండి పెద్ద కొండచరియ శుక్రవారం తెల్లవారు జామున విరిగిపడడంతో వందలాది ఇళ్లు శిథిలమయ్యాయి, తొలుత 670మందికి పైగా మరణించారని ఐక్యరాజ్య సమితి శరణార్థ సంస్థ అంచనా వేసింది.

బెహలలో బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మీనాక్షి ముఖర్జీ, సైరా షా హలీమ్

సిపిఎం అభ్యర్థి సైరా షా హలీమ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం

కోల్‌కతా : దక్షిణ కొల్‌కతా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి సైరా షా హలీమ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం సాగుతోంది. సోమవారం బెహలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మీనాక్షి ముఖర్జీ, సుదీప్ సేన్‌గుప్తా, ఇతర నాయకులు ప్రసంగించారు. సభకు భారీగా జనం హాజరయ్యారు. నాయకుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. సైరాషా హలీమ్‌కు మద్దతుగా ఖిదిర్‌పూర్, బ్రైడ్స్ వీధిలోనూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

కుల వివక్ష నివారణపై తీసుకున్న చర్యలేంటి?

- ఉన్నత విద్యా సంస్థల నుంచి నివేదిక కోరిన యుజిసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
2023-24 విద్యా సంవత్సరంలో తమ క్యాంపస్‌లలో కుల ఆధారిత వివక్షను నిరోధించడానికి తీసుకున్న వివిధ చర్యలపై నివేదిక ఇవ్వాలని అన్ని ఉన్నత విద్యా సంస్థలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) కోరింది. ఈ మేరకు సోమవారం అన్ని ఉన్నత విద్యా సంస్థలకు యుజిసి లేఖ రాసింది. జులై 31లోగా నివేదికను సమర్పించాలని అన్ని యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలను కోరింది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నుండి అందిన వివక్షపై ఫిర్యాదులను పరిశీలించడానికి కమిటీలు ఏర్పాటు చేసి ఉంటే, అలాగే కుల ఆధారిత వివక్ష సంబంధించిన ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్‌లో ఒక పేజీని క్రియేట్ చేసి ఉంటే గతేడాది కాలంలో ఎన్ని ఫిర్యాదులు అందాయి? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయనే వివరాలను తెలపాలని యుజిసి పేర్కొంది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలపై కుల ఆధారిత వివక్షపై అందిన ఫిర్యాదులను వాటి అనుబంధ కళాశాలల నుండి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించడానికి ఏర్పాటు చేసిన అంతర్గత సెల్‌ల వివరాలు సమర్పించాలని విశ్వవిద్యాలయాలను కోరింది.

'కుల వివక్షకు సంబంధించిన సంఘటనలతో వ్యవహరించేటప్పుడు మీ విశ్వవిద్యాలయం, ఇన్‌స్టిట్యూట్‌లోని అధికారులు, అధ్యాపకులు మరింత సున్నితంగా వ్యవహరించాలని సలహా ఇవ్వవలసిందిగా మీరు అభ్యర్థించారా? తదుపరి చర్యల కోసంపై సూచనలను మీ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు, అనుబంధ కళాశాలలకు కూడా పంపారా?' అని కమిషన్ ప్రశ్నించింది. విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రతి ఉన్నత విద్యా సంస్థ ఏర్పాటు చేయాల్సిన విద్యార్థి ఫిర్యాదుల పరిష్కార కమిటీ (ఎస్‌జిఆర్‌సి)లో అట్టడుగున ఉన్న కులం, తెగకు చెందిన ఒక సభ్యుడిని, ఒక మహిళను చేర్చడాన్ని కమిషన్ గత సంవత్సరం తప్పనిసరి చేసింది.

మీసా భారతికి మద్దతుగా రాహుల్‌గాంధీ ప్రచారం

అగ్నిపథ్ రద్దు

- ప్రతి మహిళకు నెలకు రూ 8,500 : రాహుల్ హామీ

పాట్నా: కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామని, ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ. 8,500 చొప్పున డిపాజిట్ చేస్తామని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. సోమవారం బీహార్‌లోని భక్తియార్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని, దేశవ్యాప్తంగా ఇండియా వేదికకు అనుకూలంగా స్పష్టమైన గాలి వీస్తుందని రాహుల్ తెలిపారు. బీహార్‌లోని షాలిగంజ్, జగదీష్‌పూర్‌ల్లో కూడా రాహుల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

బిజెపి, బిఎస్‌పి చేతులు కలిపాయి : అఖిలేష్ యాదవ్

బిజెపి, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీలు రహస్యంగా చేతులు కలిపాయని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ సోమవారం విమర్శించారు. ఘాజీపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ అఖిలేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపిని ఓడించడం ద్వారా ఉత్తరప్రదేశ్ మాత్రమే దేశాన్ని రక్షించగలదని అఖిలేష్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించడానికి ఇండియా వేదికకు ఓటు వేయాలని ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు అఖిలేష్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 'బిజెపి, బిఎస్‌పి రహస్యంగా చేతులు కలిపినట్లు కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడేందుకేనని గ్రహించి, ఇండియా వేదికకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.

బిజెపి నాయకులది ఒకటే లక్ష్యం : ప్రియాంకగాంధీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా బిజెపి నాయకులందరిదీ ఒకటే లక్ష్యమని, అది అధికారమేనని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ విమర్శించారు. బిజెపి నాయకులు అధికారం కోసం ఎంతటి మూల్యానికైనా తెగిస్తారని అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబాలో ప్రియాంక గాంధీ సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ధనబలం ఉపయోగించి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ప్రధాని మోడీ అన్ని విధాల ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు వర్షాకాలంలో విపత్తు సమయంలో హిమాచల్‌ప్రదేశ్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపిందని తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్ల పాటు అధికారంలో ఉంది. కానీ ధనిక పార్టీగా మారలేకపోయింది. కానీ బిజెపి తన పదేళ్ల కాలంలోనే ప్రపంచంలోనే అత్యంత ధనికగా పార్టీగా మారిపోయింది' అని ప్రియాంక గాంధీ విమర్శించారు.

బెంగాల్‌లో 'రెమాల్' బీభత్సం

- ఆరుగురి మృతి
- కొనసాగుతున్న వర్షాలు

కొల్‌కతా : బెంగాల్‌లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ తుపాను బెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్, బంగ్లాదేశ్‌లోని మంగ్లా పోర్టు సమీపంలోని ఖేపుపుర మధ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటిందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారులు సోమవారం ప్రకటించారు. బెంగాల్‌లో ఈ తుపాను కారణంగా ఆరుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. కోల్‌కత్తాలో గోడకూలి ఒకరు మరణించగా, దక్షిణ 24 పరగణాల జిల్లాలో చెట్టు మీద పడి ఒకరు మరణించారు. పుర్బ బర్ధమాన్‌లో విద్యుత్ షాక్‌తో ఇద్దరు మరణించారు. వీరిని తండ్రీ కుమారులుగా గుర్తించారు. అలాగే ఉత్తర 24 పరగాణాల జిలాల్లో ఒక యువకుడు, కోల్‌కతాలోని మీటిఅబ్రుజ్ ప్రాంతంలో ఒక మహిళ విద్యుత్ షాక్‌తో మరణించారు. భారీ గాలులకు, వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 15 వేల ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగానూ దెబ్బతిన్నాయి. అలాగే అనేక చెట్లు, విద్యుత్ స్థంభాలు నెలకూలినట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావానికి హసన్నాబాద్, సందేశ్‌ఖిలీ, గోసన, సాగర్, శ్యాంపుర, హరింఘత ప్రాంతాలకు ఎక్కువగా గురైనట్లు అధికారులు చెప్పారు. రోడ్లు పునరుద్ధరించడానికి, ప్రజలకు సహాయం చేయడానికి ఎన్‌డిఆర్ఎఫ్‌కు చెందిన 14 బృందాలు సోమవారం ఉదయం నుంచి నిర్విరామంగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెమాల్ తుపాను ప్రభావం త్రిపుర రాష్ట్రంపై కూడా పడింది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి. రాజధాని అగర్తల విమానాశ్రయంలో భారీగా నీరు చేరింది. దీంతో 11 విమాన సర్వీసులను రద్దు చేశారు.కోల్‌కతా ఎయిర్‌పోర్టులోనూ అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటలపాటు విమాన సర్వీసులను రద్దు చేశారు. రేమాల్ తుపాను ప్రభావం బంగ్లాదేశ్‌పై అధికంగా ఉంది. ఈ దేశంలో తుపాను కారణంగా ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత చర్యగా తుఫాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో 8 లక్షల మందికి పైగా ప్రజలను అక్కడి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ప్రభావంతో సోమవారం కూడా అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి.



కనువిప్పు

అనగనగ ఒక కాకి
గూడుకట్టింది!
గూటిలో పదిలంగ
గుడ్లు పెట్టింది!

గూడున్న చెట్టుపై
గ్రద్ద ఒకటుండే!
చిక్కిపోవుట చేత
ఎగురలేకుండె!

కాకి గ్రద్దను జూచి
కనికరము హెచ్చె
ముక్కుతో కరచకొని
మేతనందించె!

సాటి పక్షులు కొన్ని
సౌజన్య హృదిచే
కాకిలా మేతనిడె
తనకొమ్మ పైకే!

"పులుగులను
చంపేను
నా కడుపు కొరకు!
పిల్లలను చంపేను
నా పొట్ట కొరకు!

క్రూరమై మెలిగినా
కృప చూపినాయి
ఆహారమిచ్చి నను
బ్రతికించినాయి"

కనువిప్పు కలిగింది
ఆ గ్రద్ద కపుడు!
చెట్టుపై కాపలా
చేయనుందిపుడు!

పక్షులన్నిటితోడ
తాను యిట్లనెను
'ఖగజాతిలో మీరు
ఉత్తమోత్తములు

హానిచేసిన నాకు
ఆహారమిడిరి
కీడు చేసిన నాకు
కూడింత ఇడిరి

ప్రతిఫలములేమిత్తు
కాపలా ఉందు!
మీ బిడ్డలందరికి
రక్షగా ఉందు!

మన్నించి నా మాట
అంగీకరించి
ఈ పుణ్యకార్యాన్ని
నాకొసగ రండి!"

అంత పక్షులు కొన్ని
రెక్కల చప్పుళ్ళ
కరతాళ ధ్వనులుగా
వినిపించినాయి!

- కిలపర్తి దాలినాయుడు,
94917 63261.

భాగ్యనగరం చూసొచ్చాను...

హాయ్ ఫ్రెండ్స్, నా పేరు వై.జోషికా సాన్వి. నేను 8వ తరగతి చదువుతున్నాను. ఈ వేసవి సెలవులకు చారిత్రాత్మక నగరం భాగ్యనగరం, అదేనండి హైద్రాబాద్‌కి వెళ్లాను. అక్కడ బాగా ఎంజాయ్ చేశాను. ఛార్మినార్, జమా మసీదు, నిజాం మ్యూజియం, గోల్కొండ, సంఘీ ఆలయం వంటి చాలా ప్రదేశాలు సందర్శించాం. అన్నింటికంటే నాకు ఛార్మినార్ బాగా నచ్చింది. ఇది హైద్రాబాద్ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక స్మారక చిహ్నం. అలాగే నిజాం మ్యూజియంలో ఆనాటి నిజాం రాజుల ఆభరణాలు, వస్తువులు, పనిముట్లు, వస్త్రాలు, పాలరాతి శిల్పం ఆకట్టుకొన్నాయి. గోల్కొండ కోట నిర్మాణం చూస్తుంటే చాలా ఆశ్చర్యమేసింది. మా విజ్ఞాన యాత్రకు ఇది చాలా ఉపయోగపడింది. ఆ తరువాత కొన్ని ప్రముఖ ఆలయాలు కూడా చూసి ఇంటికి తిరుగుప్రయాణమయ్యాం.



జి.భాను ప్రియ,
9వ తరగతి,
ఏ.పీ మోడల్ స్కూలు,
ఎం.తిమ్మాపురం.

తుమ్మల మనోజ్ఞ,
3వ తరగతి,
వికాస్ పబ్లిక్ స్కూలు,
చాట్రాయి, ఏలూరు జిల్లా.

బి.నైనిక,
1వ తరగతి,
నారాయణ ఈ టెక్నో స్కూల్,
శ్రీకాకుళం.



గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

కేన్స్‌లో మెరిసిన భారతీయ మహిళలు

భారతీయ చిత్ర పరిశ్రమ ప్రపంచ నలుమూలలకు విస్తరించి ఎంతో కాలమైంది. అయితే అన్ని రంగాల్లో మాదిరే ఈ రంగంలో కూడా మహిళల భాగస్వామ్యం చాలా తక్కువ. ప్రధాన పాత్రలు, క్యారెక్టరు ఆర్టిస్టులు, డ్యాన్సర్లు, ఫైటర్లు, మేకప్, డైరెక్షన్, నిర్మాత.. ఏ విభాగమైనా పురుషాధిక్యతే కనిపిస్తుంది. అయితే ఈమధ్య కాలంలో మహిళలు ఈ రంగంలో రాణించడం బాగా కనిపిస్తోంది. తాజాగా మే 14 నుండి 25 వరకు జరిగిన అంతర్జాతీయ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ చిత్రసీమ గర్వించేలా వేర్వేరు విభాగాల్లో మూడు ప్రతిష్టాత్మక బహుమతులు మనకు దక్కాయి. వాటిలో రెండు మహిళలకే వరించాయి. విలక్షణ వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, ప్రశ్నించే తత్వం కలబోసిన ఆ మహిళలు విశ్వవేదికపై తమ వాణిని బలంగా వినిపించి, ఎందరో నటీనటులకు స్ఫూర్తిగా నిలిచారు.

మే 25, శనివారం 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్-2024 ముగిసింది. భారత్ నుంచి పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ వి ఇమాజిన్ ఆజ్ లైట్' చిత్రం గ్రాండ్‌ప్రిక్స్ అవార్డుకి ఎంపికైంది. మూడు దశాబ్దాల కాలంలో ఈ విభాగానికి ఎంపికైన భారతీయ చిత్రం ఇది. చిత్ర ప్రదర్శన ముగియగానే 8 నిమిషాల పాటు కరతాళ ధ్వనులతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. అలాగే 'ద షేమ్‌లెస్' చిత్రంలో నటనకు గానూ అనసూయసేన్ గుప్తా 'అన్ సెర్టైన్ రిగార్డ్' విభాగంలో ఉత్తమ నటి అవార్డును సాధించారు. ఈ అవార్డు అందుకున్న మొదటి భారతీయ నటి ఆమె. ఈ చిత్రాన్ని బల్గేరియా దర్శకుడు కన్‌స్టాంటిన్ బోజనోవ్ తెరకెక్కించారు. ప్రొడక్షన్ డిజైనర్ అయిన అనసూయసేన్ ఈ చిత్రంలో కీలక పాత్ర కూడా పోషించారు. ఇంకా ఎఫ్‌టీఐఐ విద్యార్థి చిదానంద ఎస్ నాయక్ దర్శకత్వం వహించిన 'సన్‌ఫ్లవర్స్ వర్ ధి ఫస్ట్ వన్స్ టు నో' చిత్రం స్టూడెంట్ డైరెక్టర్ విభాగంలో 'లా సినెఫ్' పురస్కారానికి ఎంపికైంది. ఉత్తమ లఘు చిత్ర కేటగిరీలో చిదానంద నాయక్ ఈ అవార్డు స్వీకరించారు.

పాయల్ కపాడియా

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ బహుకరించే రెండో అత్యుత్తమ అవార్డు సొంతం చేసుకున్న పాయల్ కపాడియా కొత్తగా దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ రంగంలో కాలుపెట్టిన స్వల్ప కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతెచ్చుకున్నారు. గ్రాండ్ పిక్స్ అవార్డు అందుకున్న మొదటి భారతీయ మహిళా దర్శకురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. పాయల్ కపాడియా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) పూర్వ విద్యార్థిని. ప్రముఖ కళాకారిణి నళిని మలాని కూతురు.

పాయల్ మొదటి నుంచి విభిన్న చిత్రాలను తెరకెక్కించారు. 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'లో విద్యార్థుల జీవితాన్ని, పోరాటాన్ని చూపించారు. 2022 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు కూడా! అప్పుడు ఈ సినిమా గోల్డెన్ ఐ అవార్డును పొందింది. అలాగే 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' చిత్రంలో దేశంలో ప్రతిష్టాత్మక ఫిల్మ్, టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, పుణెలో 2015లో జరిగిన విద్యార్థుల ఆందోళనను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ ఆందోళనలో పాయల్ కూడా పాల్గొన్నారు. ఎఫ్‌టిఐఐ ఛైర్మన్‌గా గజేంద్ర చౌహాన్‌ను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ఈ నిరసనలో ఆమె ముందు వరుసలో ఉన్నారు. 139 రోజుల చారిత్రాత్మక నిరసనకు నాయకత్వం వహించారు. కపాడియా, ఆమె సహచరులు చౌహాన్‌కు అర్హతలు లేవని గుర్తించిన కారణంగా అతని నియామకాన్ని వ్యతిరేకించారు. అయితే నిరసనలో పాల్గొన్న కపాడియా ఆ తరువాత తీవ్ర పరిణామాలకు గురయ్యారు. స్కాలర్‌షిప్‌ను రద్దు చేయడం, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి బెదిరింపుల పాల్జేశారు. ఇన్ని సవాళ్లు ఎదురైనా, కపాడియా ప్రతిభ మెరిసింది. ఆమె 13 నిమిషాల షార్ట్ ఫిల్మ్ ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్ 2017లో జరిగిన 70వ కేన్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో పోటీ విభాగానికి ఎంపికైంది. ఆ తరువాత 2018లో ఆమె డైరెక్షన్‌లో డిగ్రీ పట్టాను పొందారు.

ఇక ప్రస్తుతం గ్రాండ్‌పిక్స్ అవార్డుకు ఎంపికైన ఈ సినిమాలో ముంబయికి వలస వచ్చిన ముగ్గురు మహిళల జీవిత కథలను కళ్ళముందుంచారు. ముంబయి నగరమంటే సంపన్న వర్గాలకు, బిలీయనర్లకు, బాలీవుడ్ స్టార్లకు పెట్టింది పేరన్నట్లు చూస్తారు. కానీ అక్కడ ఎంతోమంది బతుకుదెరువు కోసం వలస వచ్చి జీవిస్తుంటారు. ఆ వలస జీవుల కథనే పాయల్ ప్రధానాంశంగా తీసుకున్నారు. వారి జీవితాలకి ప్రతిబింబించేలా ఇందులో ముగ్గురు నర్సుల జీవిత కథలను చూపించారు. అవార్డు ప్రదానోత్సవంలో ఆ ముగ్గురు నటీనటులను స్టేజిపైకి పిలిచి 'వారి సహకారం లేనిదే ఇది సాధ్యం కాద'ని పాయల్ ఎంతో భావోద్వేగంగా చెప్పారు. అలాగే 'గ్రాండ్ పిక్స్ అవార్డు రావడానికి భారతీయ చిత్రసీమకి 30 ఏళ్లు పట్టింది. అయితే రెండో గ్రాండ్ పిక్స్ కోసం మరో 30 ఏళ్లు ఎదురు చూసే పరిస్థితి ఇప్పుడు లేద'ని పాయల్ చెబుతున్నప్పుడు ప్రేక్షక లోకం నీరాజనాలు పట్టింది. ఎంతోమంది విమర్శకుల ప్రశంసలందుకున్న చిత్రాన్ని తెరకెక్కించి కూడా తన విజయాన్ని చిత్రంలో నటించిన నటీమణులకు అప్పగించిన పాయల్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

అనసూయా సేన్ గుప్తా

బాలీవుడ్‌లో సెక్స్ వర్కర్ల జీవితాలపై అనేక సినిమాలు వచ్చాయి. అలాంటి కథాంశంతో బల్గేరియన్ దర్శకుడు 'షేమ్ లెస్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో అద్భుతమైన నటన ప్రదర్శించినందుకు అనసూయకి ఉత్తమ నటి అవార్డు లభించింది. జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఇంగ్లీష్ లిటరేచర్ చదివిన అనసూయ స్వస్థలం కోల్‌కతా. నటనను వృత్తిగా ఎంచుకోవాలని ఆమె ఎప్పుడూ భావించలేదు. అయినా నటనరంగంలోనే రాణిస్తున్నారు. 'జర్నలిజం వైపు వెళ్లాలని కోరుకున్నట్లు' ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

2013లో ముంబయి వచ్చిన ఆమె, మొదట్లో సినిమాలకు ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారు. 'తన జీవితంలో అనుకోకుండా అనేక ఘటనలు జరిగాయని, అలాంటిదే ఈ చిత్రంలో రేణుక పాత్ర' అని ఆమె అనేకసార్లు చెప్పారు. ఈ అవార్డును భారతదేశంలోని క్వీర్ కమ్యూనిటీ(ఎల్జీబీటీక్యూ)కి అనసూయ అంకితం చేశారు.

'సమానత్వం కోసం పోరాడటానికి మీరు క్వీర్ కావాల్సిన అవసరం లేదు. బానిసత్వం బాధాకరమని తెలుసుకోవడానికి బానిసలుగా మారాల్సిన పనిలేదు. మంచి మనుషులుగా ఉంటే చాలు' అని ఆమె కోరుకున్నట్లు ఓ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు.

కని కస్రుతి

'ఆల్ వి ఇమేజన్ ఏజ్ లైట్' చిత్రంలో నటించిన ముగ్గురు నటీమణులు కూడా ఈ కేన్స్ ఫెస్టివల్‌లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేరళ వాసి అయిన కని కస్రూతి, ఈ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచినప్పుడు అర్ధచంద్రాకారంలో ఉన్న పుచ్చకాయ ఆకారం పోలి వున్న చేతి బ్యాగును ధరించి వచ్చారు. అది చూడడానికి చాలా విభిన్నంగా ఉంది. ఆ విషయంపైనే ఆమె మాట్లాడుతూ.. 'ఈ బ్యాగులో ఎరుపు, నలుపు, పచ్చ, తెలుపు రంగులు మేళవించి ఉన్నాయి. ఇది నా స్నేహితులు ఎంతోమంది నివసించే పాలస్తీనీయుల్ల జాతీయ జెండా గుర్తు. గత కొంత కాలంగా వారు ఊచకోతకు గురవుతున్నారు. ప్రపంచమంతా ఆ దారుణానికి సాక్ష్యంగా నిలిచింది. నా వంతుగా వారికి సంఘీభావంగా నిలబడాలనుకున్నాను. ఇది రాజకీయం కాదు. నా తోటి వారికి మద్దతు' అని ఆమె ప్రకటించింది.

మెప్పించే చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'
నేహాశెట్టి

విశ్వక్ సేన్, తానూ జంటగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అన్ని తరగతుల ప్రేక్షకులను మెప్పిస్తుందని హీరోయిన్ నేహాశెట్టి అన్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నేహ శెట్టి, అంజలి కథానాయికలు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. ఈనెల 31న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల సందర్భంగా నేహాశెట్టి మీడియాతో మాట్లాడారు. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో బుజ్జి పాత్రను పోషించాను. 1990లలో ధనవంతుల కుటుంబానికి చెందిన పల్లెటూరి అమ్మాయి పాత్ర. అందంగా కనిపిస్తూనే, ధృడంగా ఉండే పాత్ర ఇది. బుజ్జి ఒక బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి. ఒకమ్మాయిలో ఎన్ని భావోద్వేగాలు ఉంటాయో అవన్నీ తనలో ఉంటాయి. రత్న అనే పాత్రతో పాటు రత్నమాల, బుజ్జి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. రొమాన్స్, కామెడీ, డ్రామా అన్నీ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా సినిమా ఉంటుంది' అని వివరించారు.

'పెళ్లికి ఇంకా సమయం ఉంది'

'ఇప్పటికే సోషల్ మీడియా నాకు మూడు, నాలుగు పెళ్లిళ్లు చేసింది. మొదట్లో ఇలాంటి రూమర్స్ వస్తే ఇంట్లో వాళు కంగారు పడేవాళ్లు. ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆ మధ్య నేను పెళ్లి చేసుకొని అమెరికాలో సెటిల్ అయ్యాననే టాక్ వచ్చింది. అమెరికాలోనే ఉన్న మా అక్క నాకు కాల్ చేసి..'పెళ్లి అయిందటగా' అని అడిగింది. ఏమో మరి నాకే తెలియదు అని చెప్పా. రూమర్స్ కారణంగా.. నేను ఒక అబ్బాయిని తీసుకెళ్లి ఇతన్నే పెళ్లి చేసుకుంటానని చెప్పినా.. ఇంట్లో వాళ్లు నమ్మేలా లేరు. పెళ్లి అయితే ఖచ్చితంగా చేసుకుంటా. కానీ ఇప్పుడు కాదు. ప్రస్తుతం నేను సినిమాలతో చాలా బిజీగా ఉన్నాను. పెళ్లి చేసుకుంటే.. పర్సనల్ లైఫ్‌కి కూడా టైమ్ కేటాయించాలి. అందుకే కొంచెం టైమ్ తీసుకొని పెళ్లి చేసుకుంటా. పెళ్లి తర్వాత కూడా యాక్టింగ్ చేస్తా' అని హీరోయిన్ అంజలి వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో తన పెళ్లికి సంబంధించి వస్తోన్న పోస్టింగ్‌లపై ఆమె పై విధంగా స్పందించారు.

'టైగర్ నాగేశ్వరరావు'కు అరుదైన ఘనత

రవితేజ కథానాయకుడిగా గత దసరాకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన టైగర్ నాగేశ్వరరావు సినిమా ఇప్పుడు ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ సినిమాను చెవిటి, మూగ వారి కోసం ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో ఓటీటీలోకి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఘనత దక్కించుకున్న తొలి భారతీయ చిత్రంగా చరిత్రలోకి ఎక్కింది. వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. నిజ జీవిత ఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రానికి థియేటర్లలో మిశ్రమ స్పందన వచ్చింది.

చిరస్మరణీయ విజయాలు మన సొంతం

- ఫైనల్లో ఓటమితో అధైర్య పడొద్దు
- సన్‌రైజర్స్ యజమాని కావ్యా మారన్

చెన్నై: ఈ సీజన్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలను సాధించామని, ఫైనల్లో ఓటమితో అధైర్య పడొద్దని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ యజమాని కావ్యా మారన్ అన్నారు. ఐపీఎల్ ఫైనల్ ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూంలో నిరుత్సాహంలో ఉన్న ఆటగాళ్లను ఉత్సాహపరిచేలా ఆమె మాట్లాడారు. "ఈ సీజన్‌లో మీరు నిజంగా మమ్మల్ని ఎంతో గర్వించేలా చేశారు. టి20 క్రికెట్ ఆడే విధానాన్ని మీరు పునర్ నిర్వచించారు. ఐపిఎల్‌లో ప్రతి ఒక్కరూ సన్‌రైజర్స్ గురించి మాట్లాడుకునేలా చేశారు. కానీ ఈ రోజు మనది కాదు... అంతే! కానీ టోర్నీలో మీరు ఎంతో చక్కగా ఆడారు... బ్యాట్‌తోనూ, బంతితోనూ మీ ప్రదర్శనలు అమోఘం. మీ అందరికీ కృతజ్ఞతలు. గత సీజన్‌లో చివరి స్థానంలో ఉన్నాం.. ఈ సీజన్‌లో రన్నరప్‌గా నిలిచాం. అభిమానులు పెద్ద సంఖ్యలో మైదానాలకు వచ్చారంటే... అది మీ వల్లే. ఈరోజు కెకెఆర్ ఐపిఎల్ చాంపియన్‌గా నిలిచినా.. ప్రతి ఒక్కరూ సన్‌రైజర్స్ గురించే మాట్లాడుకుంటున్నారు... ఈ టోర్నీలో మనం ఆడిన ఆటను అందరూ గుర్తుంచుకుంటారు. ఎవరూ నిరుత్సాహపడవద్దు... మనం ఫైనల్స్ వరకు వచ్చామంటే మన ప్రదర్శనను ఏమాత్రం తక్కువ చేయడానికి వీల్లేదు. అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు... త్వరలోనే మళ్లీ కలుసుకుందాం" అంటూ కావ్యా మారన్ తన సందేశం వినిపించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఫైనల్లో ఓటమి అనంతరం కావ్యా మారన్ కన్నీటిపర్యంతమయిన సంగతి తెలిసిందే. అయితే, అంత బాధలోనూ ఆమె తమ ఆటగాళ్లను ఓదార్చిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

ప్రైజ్‌మనీ వివరాలు..

విజేత జట్టు	: కోల్‌కతా నైట్‌రైడర్స్	: రూ.20కోట్లు
రన్నరప్ జట్టు	: సన్‌రైజర్స్ హైదరాబాద్	: రూ.13కోట్లు
3వ స్థానం	: రాజస్తాన్ రాయల్స్	: రూ.7కోట్లు
4వ స్థానం	: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు	: రూ. 6.5కోట్లు
ఆరెంజ్ క్యాప్	: విరాట్ కోహ్లి(741పరుగులు; బెంగళూరు)	: రూ.10లక్షలు
పర్పుల్ క్యాప్	: హర్షల్ పటేల్(24వికెట్లు; పంజాబ్ కింగ్స్)	: రూ.10లక్షలు
అత్యంత విలువైన ఆటగాడు:	సునీల్ నరైన్(కోల్‌కతా)	: రూ.12లక్షలు
ఎమర్జింగ్ ప్లేయర్ :	నితీశ్‌కుమార్ రెడ్డి(సన్‌రైజర్స్)	: రూ.20లక్షలు
అల్టిమేట్ ఫాంటసీ ప్లేయర్ :	సునీల్ నరైన్(కోల్‌కతా)	
అత్యధిక ఫోర్లు :	ట్రెవిస్ హెడ్(సన్‌రైజర్స్) : 64	
అత్యధిక సిక్సర్లు :	అభిషేక్ శర్మ(సన్‌రైజర్స్) : 42	
ఉత్తమ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్ :	జాక్ ఫ్రేసర్(ఢిల్లీ) : 234.04	
క్యాచ్ ఆఫ్ ది సీజన్ :	రమణ్‌దీప్ సింగ్(కోల్‌కతా)	
ఫెయిర్ ప్లే అవార్డు :	సన్‌రైజర్స్ హైదరాబాద్	
పిచ్ అండ్ గ్రౌండ్ అవార్డు :	హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్	

కోహ్లికి ఆరెంజ్, హర్షల్‌కు పర్పుల్ క్యాప్స్...

ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లకు అందజేసే ఆరెంజ్ క్యాప్‌ను విరాట్ కోహ్లి(బెంగళూరు) అందుకున్నాడు. అతడు 15మ్యాచుల్లో 741పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. 61.75 స్ట్రయిక్ రేట్‌తో ఒక సెంచరీ, 5 అర్ధసెంచరీలతో రాణించాడు. ఇందులో 113పరుగుల అత్యధిక స్కోర్ ఉండగా.. 154.69 స్ట్రయిక్‌రేట్‌తో ఈ సీజన్ మిగతా బ్యాటర్లకు అందనంత ఎత్తులో ఉన్నాడు. ఇక పంజాబ్ కింగ్స్ బౌలర్ హర్షల్ పటేల్ 14మ్యాచుల్లో 9.73ఎకానమీతో 24వికెట్లు పడగొట్టి పర్పుల్ క్యాప్‌ను అందుకున్నాడు. నితీశ్ రెడ్డి(సన్‌రైజర్స్)కి ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సునీల్ నరైన్(కోల్‌కతా) ఆల్‌రౌండర్ ఆఫ్ ది సీజన్‌తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులు దక్కాయి. మొత్తం ఈ సీజన్‌లో ఆడిన 74మ్యాచ్‌లకు సంబంధించి ఆటగాళ్లకు, విజేత, రన్నరప్‌తోపాటు ప్రతి మ్యాచ్ విజేత, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇలా.. మొత్తం మ్యాచ్‌లకు సంబంధించి ఐపిఎల్ నిర్వాహకులు ప్రైజ్ మనీ రూ.46.5కోట్లు అందజేశారు.

ఫీవర్‌తో బాధపడుతున్నా...
విచారణకు రాలేనంటూ హేమ లేఖ

తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని, అందువల్ల రేవ్ పార్టీకి సంబంధించి విచారణకు హాజరు కాలేనని నటి హేమ బెంగళూరు పోలీసులకు లేఖ రాశారు. బెంగళూరులో ఈ నెల 19న జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్నట్లు నటి హేమ పేరు బయటకు రావడంతో టాలీవుడ్‌లో సంచలనంగా మారింది. ఆ పార్టీలో పాల్గొన్నవారి రక్త నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించగా, 86 మంది డ్రగ్స్ సేవించినట్లు తేలింది. అందులో హేమ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాటి విచారణకు హాజరు కమ్మని పోలీసులు నోటీసులు ఇచ్చారు. తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, విచారణకు మరికొంత సమయం ఇవ్వాలని హేమ కోరారు.

'ది గోట్'లో రెండు పాటలు పాడిన విజయ్

విజయ్ హీరోగా తెరకెక్కుతోన్న 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) అప్‌డేట్‌ను మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా షేర్ చేశారు. 'విజయ్ ఈ సినిమా కోసం రెండు పాటలు పాడారు. ఒకే సినిమాలో ఆయన రెండు పాటలు పాడడం ఇదే తొలిసారి' అని చెప్పారు. విజయ్ తన సినిమాల కోసం ఇప్పటివరకు 25 పాటలు పాడారు. 1994లో విడుదలైన 'రసిగన్' కోసం మొదటిసారి పాడారు. 2012లో 'తుపాకీ'లో 'గూగుల్ గూగుల్' పాటకు 'ఫేవరెట్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకున్నారు. ఇందులో విజయ్ పాడిన 'విజిల్ పోడు' సాంగ్‌ను ఇటీవల విడుదలై, ట్రెండింగ్‌లో ఉంది.

కీరవాణి వద్దంటూ లేఖ

తెలంగాణ రాష్ట్ర గీతంగా 'జయ జయహే తెలంగాణ'ని ఇదివరకే అధికారికంగా ప్రకటించారు. ఈ పాటని స్వరపరిచే బాధ్యతల్ని టాలీవుడ్ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి అప్పగించారు. ఈ క్రమంలోనే తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌ని కీరవాణి కలిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు కూడా కొన్ని బయటకొచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సినీ మ్యూజిషియన్స్ అసోసియేషన్ తాజాగా ఓ లేఖ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని పక్క రాష్ట్రాల వాళ్ళు పాడటమేంటని, ఇది తెలంగాణ కళాకారులను అవమానించడమేనని పేర్కొంది.

నాదల్, నాగల్ ఔట్..
రెండోరౌండ్‌కు జ్వెరేవ్, సిన్నర్
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ 14సార్లు టైటిల్ విజేత రఫెల్ నాదల్‌తోపాటు భారత సంచలనం సుమిత్ నాగల్ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. గాయం కారణంగా రెండేళ్ల తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన నాదల్ 3-6, 6-7(5-7), 3-6తో 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇక భారత సంచలనం సుమిత్ నాగల్ 18వ సీడ్ ఖచనోవ్(రష్యా) చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఈ మ్యాచ్‌లో నాగల్ 2-6, 0-6, 6-7(5-7)తో ఖచనోవ్ చేతిలో ఓడాడు. ముఖ్యంగా మూడో సెట్‌లో నాగల్ అద్భుతంగా పుంజుకొని సీడెడ్ క్రీడాకారుణికి ముచ్చెమటలు పట్టించాడు. ఇక ఇటలీకి చెందిన జన్నిక్ సిన్నర్ రెండోరౌండ్‌లోకి ప్రవేశించాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సిన్నర్ 6-3, 6-3, 6-4తో క్రిస్టోఫర్ ఎబోంక్స్(అమెరికా)ను చిత్తుచేశాడు. గాయం నుంచి కోలుకొని గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఎంట్రీ ఇచ్చిన సిన్నర్ పూర్వ ప్రదర్శనను కనబరిచాడు. ఇందులో 32 విన్నింగ్ షాట్స్ ఉన్నాయి. అలాగే రోలాండ్ గారోస్‌లో రికార్డును 29-2కు పెంచుకున్నాడు. మరోపోటీలో 2016రన్నరప్ ఆండీ ముర్రే తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు. తొలిరౌండ్‌లో ముర్రే 4-6, 4-6, 2-6తో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత స్టాన్ వావ్రింకా చేతిలో ఓడాడు. మరో పోటీలో 9వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 7-6(9-7), 6-4, 6-1తో ఫుస్కోవిక్(హంగేరీ), అగర్-అలిసిమి(కెనడా) 6-2, 6-4, 6-4తో నిషికోరి(జపాన్)ను ఓడించి రెండోరౌండ్‌కు చేరారు.

స్వైటెక్, వోంద్రుసోవా ముందుకు..

మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్), 5వ సీడ్ వోంద్రుసోవా(చెక్ రిపబ్లిక్) శుభారంభం చేశారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో స్వైటెక్ 6-1, 6-2తో జెంజియన్(ఫ్రాన్స్), వోంద్రుసోవా 6-1, 6-3తో మసరోవా(స్పెయిన్)లను సునాయాసంగా ఓడించారు. మరోపోటీలో 8వ సీడ్ జబీర్ 6-3, 6-2తో విక్కెర్రీ(అమెరికా), 12వ సీడ్ పొలిని(ఇటలీ) 6-3, 6-4తో సబిలి(ఆస్ట్రేలియా)ను ఓడించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68